RNI NO. 2009/2908

# అక్షరప్రభ

తెలుగు దినపత్రిక

ప్రతిఅక్షరం.. ప్రజాపక్షం

సంపుటి: 15 సంచిక: 254 ఎడిటర్: మల్లవరపు శ్రీనివాసరావు 1-10-2026 గురువారం పేజీలు: 8 వెల: 4/-

# ప్రతీ పేదవాడికి న్యాయం చేస్తాం

## 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు






**విజయవాడ, అక్షరప్రభ:** 'నేడు ఇంతమంది ముఖాల్లో నవ్వులు చూస్తున్నా. నా జీవితంలో ఈరోజును తప్పకుండా గుర్తు పెట్టుకుంటా' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. పేదల పట్టాల పండుగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని తెలిపారు. మిత్రులు పవన్ కల్యాణ్, మోదీతో కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. నేడు అభివృద్ధి, సంక్షేమంలో జెట్ స్పీడుతో ముందుకు సాగుతున్నామన్నారు. విశాఖ, మంగళగిరి, నేడు విజయవాడలో ఇన్ని వేల మందికి పట్టాలు ఇవ్వడం జీవితంలో మరచిపోనని అన్నారు. అరవై వేల మందికి పట్టాలు ఇచ్చామన్నారు. రిజిస్ట్రేషన్ విలువ రూ.19 వేల కోట్లు కాగా.. మార్కెట్ విలువ రూ.52 వేల కోట్లని వెల్లడించారు. 130 చ.గ లు యావరేజ్‌ను ఇచ్చామని, సరాసరి కోటి నుంచి రెండు కోట్ల ఆస్తిని అప్పగించామని సీఎం తెలిపారు. అందుకే పేదలకు పట్టాభిషేకమని పేరు పెట్టినట్లు పేర్కొన్నారు. యాభై, అరవై ఏళ్ల కలను సాకారం చేశామన్నారు. నిన్నటి వరకు ఆస్తి ఉన్నప్పటికీ దానిని ఉపయోగించే పరిస్థితి లేదని.. ఇప్పుడు పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. పేదల సంతోషమే నిజమైన అభివృద్ధి అని చెప్పుకొచ్చారు. 'ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వారికి పట్టాలు ఇచ్చాం.. ఇందుకు కృషి చేసిన మీ ఎమ్మెల్యేలు, అధికారులకు మీరు కృతజ్ఞత చెప్పాలి. ఎన్నికలలో మేము సుపరిపాలన అందిస్తామని చెప్పాం. మీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చాం' అని అన్నారు. ఐదేళ్ల విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించామని ముఖ్యమంత్రి అన్నారు. కూడు, గూడు, గుడ్డ పేదలకు ఇవ్వాలని అన్న ఎన్టీఆర్ మొదలు పెట్టారని.. అదే విధానాన్ని తాము అమలు చేసి పేదల గుండెలో ఆనందాన్ని నింపామని చెప్పారు. అబ్జక్షన్ లేని భూములను పేదలకు ఇవ్వాలని నిర్ణయించి అమలు చేశామన్నారు. 'ఇది వారసత్వ హక్కు.. మీరు అమ్ముకోవద్దు.. కాపాడుకోండి' అని సూచించారు. పేదలు శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకుని ఆనందంగా జీవించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సేవలను సులభతరం చేశామని చెప్పారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో ఇటువంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2019-24 మధ్య ప్రభుత్వమే భూవివాదాలను ప్రోత్సహించిందని చంద్రబాబు విమర్శించారు. ప్రజల ఆస్తులపై వారి ఫొటోలు పెట్టుకున్నారని వైసీపీపై మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వంలో నా ఫొటో లేదు, నా మిత్రుడు పవన్ కల్యాణ్ ఫొటో లేదు. కేవలం ప్రభుత్వం రాజముద్రతో మీ ఆస్తులు మీకు ఇచ్చాం' అని వెల్లడించారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా ఆస్తులు కొల్లగొట్టాలని చూశారని ఆరోపించారు. కీలుబొమ్మల్లాగా ప్రజలను ఆడించాలని చూస్తే ప్రజలు వారికి బుద్ధి చెప్పారన్నారు. తాము ఆ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని.. పేదల ఆస్తులకు భద్రత, భరోసా కల్పించామని చెప్పారు. రూపాయి కూడా లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని సీఎం తెలిపారు. అన్ని రహదారుల నిర్మాణం చేశామని, ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని అన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ ద్వారా ఉత్తరాంధ్రకు నీరు ఇచ్చామని.. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేస్తున్నామని చెప్పారు. వైసీపీ గొడ్డలి పార్టీ పట్టిసీమకు అడ్డుపడితే... తాము కట్టి చూపామన్నారు. ప్రకాశం బ్యారేజీ వద్దకు 490 టీఎంసీల నీరు గోదావరి నుంచి మళ్లించామన్నారు. ఈ ఏడాది వర్షాలు లేవని.. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు సాగు, తాగు నీరు ఇచ్చామని తెలిపారు. 14 వందల టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వెళుతున్నాయని, వంద టీఎంసీల నీరు తెస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని అన్నారు.

'మీకు హామీ ఇస్తున్నా.. పోలవరం పూర్తి చేస్తాం... నీటిని కృష్ణా డెల్టా, రాయలసీమకు మళ్లిస్తాం. కొంతమంది స్వార్థపరులు వారు బాగుంటే చాలు అనుకుంటారు. మేము అందరూ బాగుండాలని, ఆనందంగా ఉండాలని కోరుకుంటాం. గోదావరి, కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణ రాష్ట్రాలకు నీటి కొరత ఉండదు. భవిష్యత్తులో 36 ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. కృష్ణా పుష్కరాల సమయానికి గోదావరి, కృష్ణా నీరు పుష్కలంగా మనకి వస్తాయి. అభివృద్ధి, సంక్షేమం ఈ ప్రభుత్వానికి రెండు కళ్లు. పేదలకు ఆదాయ మార్గాలు చూపి జీవన ప్రమాణాలు పెంచాలి. రేపు ఉదయం ఆరు గంటలకే గుడ్ మార్నింగ్ చెప్పి పెన్షన్ అందిస్తాం. ఉద్యోగులకు ఆలస్యం అయినా.. పెన్షన్‌దారులకు ఆలస్యం చేయకుండా అందిస్తున్నాం. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగింది. భవిష్యత్తులో ఏసీ బస్సులే కొంటాం.. పేదలు అందులోనే ప్రయాణం చేయాలి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# సేవా స్ఫూర్తి.. యువతకు ఆదర్శం మాదల చైతన్య

## మాదల చైతన్యను అభినందించి సత్కరించిన నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్

**గుంటూరు, అక్షర ప్రభ:** సామాజిక కార్యక్రమాలు, క్రీడలు, విద్యా రంగాలకు తనవంతు సహకారం అందిస్తూ ముందుకు సాగుతున్న జనచైతన్య గ్రూప్ అధినేత, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మాదల చైతన్యను నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. గుంటూరు నగరంలో మాదల చైతన్యను మర్యాదపూర్వకంగా కలిసిన నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనతో ఆత్మీయంగా సమావేశమై పలు సామాజిక అంశాలపై చర్చించారు. అనంతరం శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను కొనసాగిస్తూ, యువతను సామాజిక సేవ వైపు ప్రోత్సహించాలని ఆకాంక్షించారు.

### సేవా కార్యక్రమాలే ముఖ్యం...

మాదల చైతన్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్న పలు సేవా కార్యక్రమాలను ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు ప్రస్తావించారు. అన్నదాన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, విద్యార్థులకు ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు సహకారం, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ఆర్థిక చేయూతతో పాటు ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అవసరంలో ఉన్న వారికి సాధ్యమైనంత సహాయం అందించడం ద్వారా సామాజిక బాధ్యతను కొనసాగించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

### విద్యార్థులకు అండ... నిరుద్యోగులకు చేయూత....

విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో అవసరమైన వారికి సహాయం అందించడం, ఉపాధి కోసం ప్రయత్నిస్తున్న నిరుద్యోగులకు తనవంతు సహకారం అందించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, యువతకు అవకాశాలపై అవగాహన కల్పించడం, అవసరమైన వారికి సాధ్యమైన సహాయం అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



### వైద్య శిబిరాలు.. ఆరోగ్యం పరమావధిగా...

ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాల నిర్వహణకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు అవసరమైన సందర్భాల్లో ఆర్థిక సహాయం అందిస్తూ వారికి ధైర్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

### అన్నదాన వితరణ లోనూ భాగస్వామ్యం...

వివిధ పండుగలు, సామాజిక కార్యక్రమాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తూ భక్తులకు, ప్రజలకు సేవ చేయడం (తరువాయి 4వ పేజీలో)



అక్షరప్రభ

## సంపాదకీయం

# కారకులెవరు?

ఒక విద్యార్థి చనిపోయినప్పుడు మొదటి ప్రశ్న అతను ఏ తప్పు చేశాడనే దానిపై ఉండకూడదు. అతను అలాంటి తీవ్ర నిర్ణయం తీసుకునే స్థితికి ఎలా చేరుకున్నాడు? ఆ సమయంలో విద్యాసంస్థ అతని సమస్యను వినే ప్రయత్నం చేసిందా? అవసరమైన సహాయం అందించిం దా? అతని ఫిర్యాదులకు పరిష్కారం దొరికేమార్గం ఉందా? ఇవే ముందుగా పరిశీలించాల్సిన ప్రశ్నలు. ముంబైలోని ఐఐటీ విద్యార్థి సహిల్ వాకోడే మరణం తర్వాత వెలుగు లోకి వచ్చిన పరిణామాలు ఈ ప్రశ్నలను మరింత ము ఖ్యంగా చేశాయి. విద్యార్థి పరీక్ష సమయంలో సెల్ ఫోన్ ఉపయోగించాడని, ప్రశ్నపత్రాన్ని కృత్రిమ మేధా సాధనా నికి పంపాడని ఐఐటీ బొంబాయి తొలుత ప్రకటించింది. అయితే దర్యాప్తు పూర్తికాకముందే మరణించిన విద్యార్థికి సం బంధించిన వివరాలను వెల్లడించడం తగదని తర్వాత సంస్థ క్షమాపణ చెప్పింది. ఈ పరిణామం ఒక ప్రాథమిక సూత్రాన్ని గుర్తుచేస్తుంది. మరణించిన విద్యార్థి ఇక తన తరపున వివరణ ఇవ్వలేదు. కాబట్టి అతని గురించి తుది అభిప్రాయాన్ని దర్యాప్తుకు ముందే నిర్మించడం న్యాయ నమ్మతం కాదు. ఇదే సందర్భంలో విద్యార్థి కుటుంబం కులవివక్షకు సంబంధించిన ఆరోపణలు చేయడం, వాటిపై పోలీసు కేసు నమోదవడం కూడా సమగ్ర విచారణలో భాగం కావాలి. ఆరోపణలను ముందుగానే నిజమని తేల్చ డం ఎంత తప్పో, వాటిని విచారణ లేకుండానే కొట్టిపారే యడం కూడా అంతేతప్పు. విద్యార్థి ఏదైనా తప్పుచేసి ఉంటే దానిపై నిబంధనల ప్రకారం విచారణ జరగాలి. కానీ ఆ తప్పు జరిగిన సందర్భాన్ని కూడా పరిశీలించాలి. అతనికి తన వాదన చెప్పే అవకాశం దొరికిందా? సమస్యను పరి ష్కరించుకునే అవకాశం కల్పించారా? ఒక విద్యార్థి తీవ్ర నిస్సహాయత, న్యూనతా భావం, మానసిక సంక్షోభం లేదా ఒత్తిడిలోకి వెళ్లినప్పుడు, అతని వ్యక్తిగత పరిస్థితుల తోపాటు సంస్థలోని పరిస్థితులు ఏమైనా ప్రభావం చూపిం చాయా అనే ప్రశ్నను కూడా పరిశీలించాలి. విద్యార్థి ఎందుకు ఆ స్థితికి చేరుకున్నాడో తెలుసుకోవాల్సిన దర్యాప్తును, అతను ఏ తప్పు చేశాడో నిరూపించే ప్రక్రియగా మార్చకూ డదు. జాతీయ నేర గణాంకాల ప్రకారం 2004లో 5,610గా ఉన్న విద్యార్థుల ఆత్మహత్యలు 2024 నాటికి 14,488కు పెరిగాయి. ఇదే కాలంలో మొత్తం ఆత్మహత్య ల్లో విద్యార్థుల వాటా 4.9 శాతం నుంచి 8.5 శాతానికి పెరిగింది. ఈ గణాంకాలు ప్రతి మరణానికి ఒకే కారణం ఉందని చెప్పవు. అయితే విద్యార్థుల ప్రాణాలను కాపాడేం దుకు విద్యాసంస్థల బాధ్యతను మరింత లోతుగా పరిశీలిం చాల్సిన అవసరాన్ని మాత్రం స్పష్టం చేస్తున్నాయి. సహిల్ వాకోడే మరణంతర్వాత విద్యార్థుల నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో ఐఐటీ బొంబాయి డీన్ను పరిపాలనా బాధ్య తల నుంచి సస్పెండ్ చేసింది. సంస్థ తన పరీక్షాశిక్షా విధా నాన్ని కూడా సమీక్షించేందుకు అంగీకరించింది. విద్యార్థులు గతంలో సమర్పించిన ఫిర్యాదులకు స్పందన లు రాలేదని, తమ ఫిర్యాదుల స్థితి కూడా తెలియలేదని ఈసందర్భంగా తెలిపారు. దీనిపై విద్యార్థులు తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకునేలా మరింత విద్యార్థి అనుకూల వ్యవస్థ ను ఏర్పాటు చేస్తామని సంస్థ హామీ ఇచ్చింది. అందుకే విద్యార్థి మరణంపై జరిగేవిచారణ పరిధి కూడావిస్తృతంగా ఉండాలి. విద్యార్థి వ్యక్తిగత పరిస్థితులు, విద్యా ఒత్తిడి, పరి పాలనా వైఖరి, ఫిర్యాదుల పరిష్కారం, వివక్షకు సంబంధిం చిన ఆరోపణలు, అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థ వంటి అంశాలను అవసరమైన మేరకు పరిశీలించాలి. ఒకే కారణాన్ని ముందుగానే నిర్ణయించుకుని మిగతా ప్రశ్నలను మూసివేయడం నిజమైన దర్యాప్తు కాదు. నిజాలను నిగ్గు తేల్చడంలో వ్యవస్థ విఫలమైతే, ఆ మరణం ఒక మూగ సాక్ష్యంగా మిగిలిపోతుంది. అందుకే విద్యార్థి చనిపోయిన తర్వాత అసలు పరీక్ష అతనిది కాదు, సంస్థదే.

## వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి



**ఆలమూరు, అక్షరప్రభ:** తుఫాను వర్షాల నేపథ్యంలో ఆలమూరు మండల పరిధిలోని వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడిఏ)సిహెచ్.కె.వి.చౌదరి కోరారు. ఆయన బుధవారం మండలంలోని వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు.ప్రస్తుతం పల్లపు ప్రాంతాల్లోని పొలాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల వరి పంటకు తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరి పంట ఇప్పుడు పొట్ట దశలో ఉన్నందున, అధిక తేమ కారణంగా కాండం తొలిచే పురుగు, పొట్టకుళ్ళు మరియు మాగుడు తెగుళ్లు ఆశించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.ఈ పరిస్థితిని అధిగమించడానికి రైతులు ముందుగా పొలాల్లో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం పొట్టకుళ్ళు, మాగుడు తెగుళ్ల నివారణ కోసం లీటరు నీటికి 2 మి.లీ. ప్రొపికోనజోల్ కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. అలాగే కాండం తొలిచే పురుగు ఆశించకుండా జాగ్రత్తగా లీటరు నీటికి 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 2 గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరైడ్ చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలని ఎ.డి.ఎ చౌదరి రైతులకు వివరిస్తూ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## కొత్తపేటలో బీజేపీ స్వచ్ఛ భారత్




**కొత్తపేట, అక్షరప్రభ:** భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన మాసోత్సవ సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా ఈరోజు కొత్తపేట మెయిన్ రోడ్డు రెడ్డప్ప వారి పేట వద్ద బిజెపి నాయకులు స్వీపర్స్ తో కలిసి చెత్తకుప్పలు తరలించి,శుభ్రంచేసి స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి నియోజకవర్గ ఇంఛార్జి పాలూరి సత్యానందం విచ్చేసి నాయకులతో పాటూ రోడ్లు శుభ్రంచేసారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలుగన్న పరిశుభ్ర భారతావనిని సాధించడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని గాంధీ జయంతి సందర్భంగా 2014, అక్టోబర్ 2 న ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమానికి పిలుపునిచ్చారని, 2014 సెప్టెంబరు 24న భారత కేంద్ర కేబినెట్ పట్టణప్రాంతాలలో స్వచ్ఛ భారత్ మిషన్ కు ఆమోదం తెలిపిందనీ తెలిపారు. నరేంద్ర మోడీ గారి జన్మదిన సందర్భంగా నెలరోజులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని దానిలో భాగంగా ఈరోజు పారిశుధ్య కార్మకులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొనండం ఆనందంగా ఉందనీ ప్రతి ఒక్కరూ కూడా తమ పరిసరాలు శుభ్రంగా ఉంచి రోగ రహితమైన భారతావనిని స్వచ్ఛ భారతాన్ని సాధించాలని సేవా సంకల్ప్ అభియాన్ మండల కన్వీనర్ పాలూరి జయప్రకాశ్ నారాయణ అన్నారు. ఈ కార్యక్రమం లో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి కోటిపల్లి సుబ్రహ్మణ్యం, మండల ఉపాధ్యక్షురాలు శ్రీమతి కోటిపల్లి సుబ్బలక్ష్మి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అన్యం సత్యనారాయణ, కిసాన్ మోర్చ జిల్లా కార్యవర్గ సభ్యులు కోటిపల్లి రఘురాం, మండల మహిళా మోర్చ అధ్యక్షురాలు పేకేటి కామేశ్వరి దివ్య,జిల్లా యువమోర్చ ఉపాధ్యక్షులు కోటిపల్లి దామోదర్, మండల ఓబిసి మోర్చ అధ్యక్షులు రేలంగి ఆంజనేయులు, యువమోర్చ మండల ప్రధాన కార్యదర్శి చోడపనీడి ముఖేష్, టిడిపి తెలుగురైతు మండల అధ్యక్షులు చోడపనీడి భాస్కరరావు, వీధి విజయ భాస్కరరావు, నీలం సుబ్బారావు, ఈశ్వరి మరియు పారిశుధ్య అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఆర్మీ ఆయుధాల చోరీ వెనుక మరో ఇద్దరు!





**హైదరాబాద్, అక్షరప్రభ:** ఆర్మీ ఆయుధాల దొంగతనం కేసులో మరో మలుపు. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఆర్మీ మాజీ హవల్దార్ మల్లేష్‌కు.. బెటాలియన్‌లోని ఇద్దరు ఇన్‌చార్జి స్థాయి అధికారులు సహకరించినట్లుగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. మల్లేష్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్న విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా దొంగతనం ఎలా జరిగిందన్న దానిపై 'సీన్ రీ కన్‌స్ట్రక్షన్' జరిపి, ఇతర నిందితుల పాత్రను గుర్తించారు. ఆయుధాలు నిల్వ ఉంచే కేంద్రం(కోటె) ఇన్‌చార్జితో పాటు, మరో ఇన్‌చార్జి మల్లేష్‌కు సహకరించినట్లుగా ప్రాథమికంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు ఇన్‌చార్జిలకు మల్లేష్‌కు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగాయని, వాటిపై లోతుగా విచారించిన పోలీసులు.. ఆయుధాల చోరీకి, ఈ లావాదేవీలకు మధ్య సంబంధం ఉందని అనుమానిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితునికి సహకరించినట్లు పూర్తి ఆధారాలు లభ్యమైతే వారినీ అరెస్టు చేసే అవకాశం ఉంది.

## అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం: స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**మాకవరపాలెం, అక్షరప్రభ:** గ్రామాల సర్వాంగీణ వికాసమే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ప్రభుత్వం శ్రమిస్తోందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా మాకవరపాలెం మండలం, శెట్టిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్గర్ మరియు ఆజీవిక మిషన్ గ్రామీన్'గ్రాంట్ కింద మన రాష్ట్రానికి రూ.11,085 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.5,391 కోట్లు (50 శాతం) కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.5,694 కోట్లు (50 శాతం) గా ఉందన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని 421 అభివృద్ధి పనుల కోసం రూ.43 కోట్ల 59 లక్షల గ్రాంట్ కేటాయించినట్లు స్పీకర్ తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల వారీగా నిధుల వివరాలను వెల్లడిస్తూ.. మాకవరపాలెం మండలానికి 76 వర్కులకు గాను రూ.10 కోట్ల 10 లక్షలు, నాతవరం మండలానికి 148 వర్కులకు రూ.21 కోట్ల 86 లక్షలు, నర్సీపట్నం మండలానికి 104 వర్కులకు రూ.5 కోట్ల 38 లక్షలు, అలాగే గొలుగొండ మండలానికి 93 వర్కులకు గాను రూ.6 కోట్ల 26 లక్షల గ్రాంట్ ఇచ్చామని వివరించారు. గతంలో మాకవరపాలెం మండలానికి అందించిన రూ.114 కోట్ల అభివృద్ధి నిధులతో పాటు, ఇప్పుడు కేటాయించిన రూ.10.10 కోట్లతో కలిపి మొత్తం రూ.124 కోట్ల గ్రాంట్ మంజూరు చేశామని తెలిపారు. దీనికి అదనంగా ప్రాంతీయ ఉపాధి ప్రోత్సాహకం కింద రూ.10 కోట్లతో కాఫీ ప్రాసెసింగ్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రత్యేకంగా శెట్టిపాలెం పంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఇప్పటివరకు ఈ ఒక్క పంచాయతీకే రూ.3 కోట్ల 52 లక్షల విలువైన పనులు మంజూరు చేశామని స్పీకర్ తెలిపారు. ఇందులో మొదటగా 12 వర్కులకు గాను రూ.2 కోట్ల 12 లక్షలు ఇవ్వగా, తాజాగా మరో రూ.40 లక్షలతో 2 కొత్త రోడ్లను, రామాలయ నిర్మాణానికి రూ.1 కోటి నిధులను కేటాయించినట్లు స్పష్టం చేశారు. గ్రామాల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సూర్యచంద్ర, పాలెం మండలం పార్టీ ప్రెసిడెంట్ ఆర్ వై పాత్రుడు, అల్లు నాయుడు, నందకిషోర్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు మరియు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## నాణ్యమైన రోడ్లు మెరుగైన మౌలిక వసతులే కూటమి ప్రభుత్వ సంకల్పం..





**పరవాడ, అక్షరప్రభ:** పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం మండలం అసకపల్లి నుండి పరవాడ మండలం లంకెలపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ వరకు గల రోడ్డును నెలరోజుల్లోగా పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు బుధవారం జనసేన పార్టీ విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేశ్ బాబు తెలిపారు. రహదారులు మరియు భవనాల శాఖ జిల్లా అధికారులు,ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి ఆ రోడ్డులో పర్యటించిన ఎమ్మెల్యే భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా శిధిలమై ఉండటం పట్ల ఆవేదన వ్యక్తం చేసారు.అలాగే ఇటీవల లంకెల పాలెం బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడటంపైనా ఆంధోళన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ పైడివాడ అగ్రహారం నుండి పెదముసిడివాడ వరకు రోడ్డు నిర్మాణానికి 2.5 కోట్లు, లంకెలపాలెం జంక్షన్ నుండి పరవాడ వరకు రోడ్డుకు 1.2 కోట్లు, లంకెలపాలెం ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు పనులకు 39.90 లక్షలు నిధులు మంజూరైనాయని వెల్లడించారు. అయితే కాంగ్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రోడ్లు నిర్మాణ పనులు ఆలస్యమౌతున్నాయని, అయినా నేటి నుండే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలియచేసారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచిందని 16 లక్షల నిధులను వైద్యఖర్చులు కోసం లెటర్ ఆఫ్ క్రెడిట్ (గూజ ) కేటాయించిందని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు గారు తెలిపారు ఇంకా అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేసి ఆకుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో రహదారులు మరియు భవనాల శాఖ ఉమ్మడి జిల్లా పర్యవేక్షణ ఇంజనీర్ కే జాన్ సుధాకర్, కార్య నిర్వహణ అధికారికె.వి రంగయ్య గారు, ఉప కార్యనిర్వాహణాధికారి ఎన్ నరసింహమూర్తి, సహాయక కార్యనిర్వాహన అధికారి లలిత, రెండు మండలాల ఉమ్మడి కూటమి నాయకులు , కార్యకర్తలు మహిళలు యొక్క పర్యటన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జ్ఞానేశ్ కుమార్‌ను ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించాలి..'వోట్ చోర్ గద్దీ చోడ్' రెండో దశ కాంగ్రెస్ నిరసన




**విశాఖపట్నం, అక్షరప్రభ:** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి, ఆయనపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మరాజు ఆధ్వర్యంలో 'వోట్ చోర్ గద్దీ చోడ్' రెండో దశ నిరసనలో భాగంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం కూడా ఆందోళన చేపట్టారు. అనంతరం గాంధీ విగ్రహం నుంచి పాత జైలు రోడ్డు మీదుగా ఇందిరాగాంధీ విగ్రహం వరకు నల్ల బెలూన్లు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యుడు వేగి వెంకటేష్ మాట్లాడుతూ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. గతంలో వివిధ పదవుల్లో పనిచేసిన సమయంలో ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించే అధికారిని ఎన్నికల కమిషనర్‌గా నియమించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు లక్కరాజు రామారావు, పీసీసీ జనరల్ సెక్రటరీ గడమ్ మహెద్ కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునంద, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సోడదాసి సుధాకర్, భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రామకృష్ణ, దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.వి. సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు



**విశాఖపట్నం, అక్షరప్రభ:** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. 37వ వార్డు పరిధిలోని జబ్బర్ తోట, 35వ వార్డు పరిధిలోని వెలంపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో భక్తుల కోసం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. వినాయక చవితి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సేవాభావం, సామాజిక స్ఫూర్తిని పెంపొందించేలా నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు పేర్కొన్నారు. ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నేతలు,, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ శాఖలో సుదీర్ఘ సేవలందించిన ఏఎస్ఐలకు ఘన వీడ్కోలు: అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు




**అనకాపల్లి, అక్షరప్రభ:** : పోలీస్ శాఖలో మూడు దశాబ్దాలకు పైగా నిస్వార్థంగా సేవలందించి నేడు పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు ఎంతో శ్లాఘనీయమని జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు కొనియాడారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఏఎస్ఐలకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్బీ) విభాగంలో 36 సంవత్సరాల పాటు సేవలందించిన ఏఎస్ఐ ఎన్.ఫణిదత్తు, అలాగే ఏ.కోడూరు పోలీస్ స్టేషన్‌లో 37 సంవత్సరాల సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసుకున్న ఏఎస్ఐ అబ్దుల్ రెహమాన్‌లను అదనపు ఎస్పీ శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజా రక్షణకు జీవితాన్ని అంకితం చేసిన వీరి సేవలు ఆదర్శనీయమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితాన్ని సంపూర్ణ ఆయురారోగ్యాలు, మానసిక ప్రశాంతత, కుటుంబ సుఖసంతోషాలతో గడపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. సత్కారం అందుకున్న ఏఎస్ఐలు మాట్లాడుతూ, తమ సుదీర్ఘ సర్వీసులో సహకరించిన ఉన్నతాధికారులకు, తోటి సిబ్బందికి, అలాగే కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో సి.హెచ్.తిలక్ బాబు, సీఐలు బాల సూర్యరావు, లక్ష్మి, శ్రీనివాసరావు, అశోక్ కుమార్, గోవిందరావు, సతీష్, రమేష్, రమణయ్య, రమణమూర్తి, విజయ ఎస్సైలు ప్రసాద్, సురేష్ బాబు, అంజిబాబు, విక్టోరియా రాణి, సత్య ప్రసాద్, సూర్య ప్రకాష్, శ్రీనివాసరావు, నరసింహారావుతో పాటు ఇతర పోలీస్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు, బ్యాచ్‌మేట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'యువత భవిత'లో భాగంగా ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మంత్రి మమేకం



**ఉరవకొండ, అక్షర ప్రభ:** విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే జీవితంలో విజయాలు సాధించవచ్చని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. 'యువత భవిత' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బీకాం ప్రథమ సంవత్సరం తరగతి గదిలోకి వెళ్లిన మంత్రి కొంతసేపు అధ్యాపకుడిగా మారి విద్యార్థులతో మమేకమయ్యారు. పాఠ్యాంశాలతో పాటు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే విధానంపై అవగాహన కల్పించారు. అవమానాలు, అపజయాలతో కుంగిపోకుండా వాటినే విజయానికి మెట్లుగా మలుచుకోవాలని సూచించారు. తాను పాఠశాల స్థాయిలో ఎదుర్కొన్న అవమానాన్ని సవాలుగా తీసుకుని మూడు నెలల్లోనే తన సత్తా చాటుకున్న విషయాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లోనూ అపారమైన ప్రతిభ దాగి ఉందని, సరైన లక్ష్యంతో కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మంత్రి స్వయంగా తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు ప్రేరణాత్మక విషయాలు బోధించడం వారిలో ఉత్సాహాన్ని నింపింది.

## తిరుపతి నుంచి వారణాసి వరకు సేవా సంకల్ప యాత్ర వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ నేతృత్వంలో బైక్‌లపై ప్రయాణం



**తిరుపతి, అక్షర ప్రభ :** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం పురస్కరించుకొని టి ఎన్ ఎస్ ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో సేవా సంకల్ప యాత్ర చేపట్టారు. టీడీపీ జాతీయ వర్కింగ్ అధ్యక్షులు, మంత్రి నారా లోకేష్ సూచనలతో తిరుపతి నుంచి వారణాసి వరకు 25 మంది యువత బైక్ యాత్రకు శ్రీకారం చుట్టారు. సుమారు 2500 కిమీ మేర సాగే ఈ బైక్ యాత్ర కు వీఎంఆర్డీఏ చైర్మన్, టి ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం వి ప్రణవ్ గోపాల్ నేతృత్వం వహిస్తున్నారు. బుధవారం తిరుపతి అలిపిరి గరుడ సర్కిల్ వద్ద టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తిరుపతి టీడీపీ ఇంచార్జి జే బి శ్రీనివాస్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, సత్యవేడు అసెంబ్లీ సమన్వయ కర్త పి శంకర రెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఇంచార్జి పనబాక లక్ష్మి యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ , ఇతర కూటమి నాయకులు పాల్గొని బైక్ యాత్రను ప్రారంభించారు. ఈ నెల 30 న ప్రారంభమైన ఈ సేవా సంకల్ప యాత్ర అక్టోబర్ 8 న బైక్ యాత్ర వారణాసి చేరుకుంటుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల మీదుగా ఈ బైక్ యాత్ర సాగుతుందని తెలిపారు. ఈ యాత్రలో భాగంగా పలు ప్రముఖ ఆలయాలను దర్శించనున్నామని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రజాసేవలో 25 ఏళ్ల ప్రస్థానం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, సుపరిపాలన, ఆర్థిక ప్రగతి, మౌలిక వసతుల విస్తరణలో ఆయన చేస్తున్న కృషి కొనసాగాలని ఆకాక్షించారు. బైక్ యాత్ర లో భాగంగా తిరుపతి నుంచి కాళహస్తి చేరుకోగా, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కాళహస్తి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కాళహస్తి నుంచి కావలి వరకు బైక్ యాత్ర చేరుకుంది. గురువారం సాయంత్రం నాటికి ఈ బైక్ యాత్ర విజయవాడకి చేరుకుంటుందని తెలిపారు.

## మున్సిపల్ ఆప్కాస్ కార్మికులకు టైంస్కేల్ అమలు చేయాలి




**విశాఖపట్నం, అక్షరప్రభ:** జివిఎంసి పరిధిలో ఉన్న మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న వివిధ విభాగాల కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలని, డెత్, సిక్, రిటైర్మెంట్ పోస్టులు వారసులకు ఇవ్వాలని ఇవ్వాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు డిమాండ్ చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల డిమాండ్లపై మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు ఇచ్చిన పిలుపులో భాగంగా విశాఖ ఈస్ట్ జోనల్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం కార్మికులు పెద్దసంఖ్యలో ధర్నాలు చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి రాజు మాట్లాడుతూ గత 3 ఏళ్ళుగా జీతాల పెంపు కోసం, 12వ పిఆర్సి వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. నేటికీ 12వ పిఆర్సి కమీషన్ను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు పిఆర్ సి జీతాలు, డిఎ, కరువుభత్యం వర్తింపచేయాలని, ఉమ్మడి రాష్ట్రంలో సిఐటియు అనుబంధ సంఘం నిర్వహించిన పోరాట ఫలితంగా నాటి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు పిఆర్సి జీతాల చెల్లింపు, డిఎ, ఐఆర్ తో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు నైపుణ్యంతో కూడిన జీతాలు చెల్లిస్తామంటూ జీఓ ఆర్ టి నెం. 1615 ను 2013 లో జారీచేసింది. ఈ జీఓ అమలు కోసం కార్మికులు అనేక పోరాటాలు నిర్వహించడాన్ని గుర్తుచేసారు. ఐనా ప్రభుత్వంలో చలనం రావటంలేదు. మరోవైపు డెత్, సిక్కు, రిటైర్మెంట్ స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు కల్పించకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు పోస్టులను అమ్ముకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కార్మికుల డిమాండ్ల పరిష్కారం చేయకపోతే సిఎం క్యాంప్ ఆఫీస్ ముట్టడికైనా సిద్ధపడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వి. కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను అదుపుచేయటం లేదు సరికదా కనీస ధరలకు అనుగుణంగా జీతాలైనా పెంచాలని డిమాండ్ చేసారు. గత 8 ఏళ్ళల్లో అన్ని రకాల ధరలు వందలరెట్లు పెరిగాయి. కరెంట్చార్జీలు రెట్టింపు అయ్యాయి. పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇంటి అద్దెలు అమాంతంగా పెరిగిపోయాయి. కానీ ఉద్యోగులు, కార్మికుల జీతాలు మాత్రం ప్రభుత్వాలు సకాలంలో పెంచడంలేదన్నారు. గత 11వ పిఆర్సి ని రెండేళ్ళు ఆలస్యంగా అమలుచేశారు. ప్రస్తుతం 12 వ పిఆర్సి ని ఏర్పాటు చేయడం లేదు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు ఏళ్ళతరబడి జీతాలు పెరగకపోవడం వల్ల జీవితాంతం నష్టపోతున్నారు. మరోవైపు కార్మికులు తమ నివాసం ప్రాంతం నుండి పనిప్రదేశానికి వెళ్ళి రావటానికి నెలకు కనీసం 3వేల రూపాయలు పైబడి ఖర్చు అవుతుంది. అష్టకష్టాలుపడి వారికి వచ్చే వేతనాలు సరిపోక అప్పులబారిన పడుతున్నారు. కావున టిఎ, డిఎని, మధ్యంతరభృతి మొదలగు సౌకర్యాలు కల్పించి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను ఆదుకోవాలని యనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. ఈ ధర్నాకు జోన్ కార్యదర్శి జె.ఆర్.నాయుడు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ ఆర్.శ్రీనివాసరావు, బి.రత్నం, సిఐటియు నాయకులు వి. నరేంద్రకుమార్, కె. కుమారి, మున్సిపల్ నాయకులు రాజు, విజయ, కొండమ్మ, ఎ.శ్రీను, రమణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల ప్రగతికి కమిటీలు కీలకం: మంత్రి పయ్యావుల



**ఉరవకొండ రూరల్ అక్షర ప్రభ :** నియోజకవర్గ వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ పాఠశాలల కమిటీల చైర్మన్లు, సభ్యులు బుధవారం ఉరవకొండలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలల అభివృద్ధిలో కమిటీలు కీలకంగా పనిచేయాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. పిల్లలను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతతో పనిచేయాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

## విద్యా వికాసం, విద్యా వాహిని కార్యక్రమాలు ప్రారంభం



**ధర్మవరం, అక్షరప్రభ:** ధర్మవరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య, సరైన మార్గదర్శనం అందించే లక్ష్యంతో ఏకలవ్య ఫౌండేషన్, సంస్కృతి సేవా సమితి సహకారంతో విద్యా వికాసం, విద్యా వాహిని కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ధర్మవరంలోని శ్రీ గణేష్ మున్సిపల్ స్కూల్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యా శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమాల ముఖ్యాంశాలు: ధర్మవరం అర్బన్, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ -- మొత్తం 5 మండలాల్లో అమలు.. 30 ఉచిత ట్యూషన్ కేంద్రాల ఏర్పాటు. 30 మంది స్థానిక ట్యూటర్ల నియామకం. 843 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సహాయం.. 40 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యా వాహిని అమలు.. ఆగస్టు 10, 2026 నుంచి 30 విద్యా వికాసం కేంద్రాలు పనిచేయడం ప్రారంభించాయి. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ప్రాథమిక అభ్యాస సామర్థ్యాలు, విద్యా ప్రగతి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత మెరుగుపడేలా కృషి చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంచడం, వారిలోని ప్రతిభను వెలికితీయడం, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించడం ఇదే మా లక్ష్యం.

# సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



**చింతపల్లి, అక్షరప్రభ:** సీతంపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరి బిడ్డలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రధానంగా విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలకు నోచుకోవడం లేదు. 20సబ్‌ప్లాన్ మండలాల్లో ప్రాథమిక విద్యకు వసతి కరువైంది. గిరిజన చిన్నారులు చదువు కునేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. మారుమూల గిరిజన గ్రామాలకు నిర్మిస్తున్న రహదారులకు గ్రహణం పట్టింది. గిరిజన యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఎంఎస్ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేసినా.. అవగాహన లేక పరిశ్రమల ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదు. మరోవైపు గిరిజనులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంతో పోల్చుకుంటే గిరిజనసంక్షేమంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించినప్పటికీ క్షేత్రస్థాయిలో పథకాల అమలులో పర్యవేక్షణ కొరవడింది. ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నేపథ్యంలో గిరిజనులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తమ సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం చూపాలని కోరుతున్నారు.

వాస్తవంగా ప్రతి మూడు నెలలకొకసారి పాలకవర్గ సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే సీతంపేట ఐటీడీఏ వేదికగా ఈ సమావేశాలు 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో సజావుగా జరిగేవి. 2019 తరువాత వైసీపీ సర్కారు ఆ సంస్కృతికి ఫుల్‌స్టాప్ పెట్టింది. 2022 ఏడాదిలో ఒకసారి మాత్రమే సీతంపేట ఐటీడీఏ వేదికగా పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత పాలకవర్గ సమావేశం ఊసే లేకుండా పోయింది. ఎట్టకేలకు నాలుగేళ్ల తరువాత నేడు 78వ పాలకవర్గ సమావేశాన్ని ఐటీడీఏలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 189 గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో 33 బడులు శిథిలావస్థలో ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే గిరిజన విద్యార్థులు బిక్కుబిక్కు మంటూ చదువుకోవాల్సిన దుస్థితి. జీపీ పాఠశాలల్లో ఇప్పటికీ 12వరకు రేకుల షెడ్డుల్లోనే నిర్వహిస్తున్నారు. దీనిపై గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో (2022-23) ఉపాధి హామీ పథకం నిధులు రూ.54.88కోట్లతో నిర్మించిన సుమారు 36రహదారులపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇప్పటికీ వాటిపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో గిరిజన గ్రామాల్లో రహదారి నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. విజిలెన్స్ నుంచి క్లియరెన్స్ వస్తేకాని పనులు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. ఇక రూ.3కోట్లతో కారెం కొత్తగూడ -వంబరెల్లి గ్రామానికి 2022లో రహదారి నిర్మాణం ప్రారంభించిన కాంట్రాక్టర్ సగంలో పనులు నిలిపివేశాడు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో ఆప్రాంత గిరిజనులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్‌శాఖ పరిధిలో మరికొన్ని రహదారుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత డోలీరహిత గిరిజన గ్రామాలే లక్ష్యంగా ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 2025-26లో రూ.4.57 కోట్లతో ఆరు రహదారుల పనులను చేపట్టారు. అయితే వాటిలో నాలుగు రహదా రుల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో రెండు రహదారులు వివిధ దశల్లో ఉన్నాయి. పల్లెపండుగ పథకంలో భాగంగా గిరిజన గ్రామాలకు సీసీ రహదారులతో పాటు అంతర్గత రోడ్ల పనులు చేపట్టినా.. నిధులు ఇంకా విడుదల కాలేదు. గత ప్రభుత్వ హయాంలో 2022లో రూ.49.26కోట్లతో సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాల నిర్మాణం ప్రారంభించారు. ఒప్పందం ప్రకారం 2025 నాటికి పనులు పూర్తికాలేదు. ఇప్పటికి 80శాతం నిర్మాణం మాత్రమే పూర్తయింది. రూ.25.84కోట్ల వరకు బిల్లుల రూపంలో చెల్లించారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం నత్తనడకన సాగుతుండడంతో గిరిబిడ్డలకు మెరుగైన వైద్యసేవలు ఇప్పట్లో అందే పరిస్థితి కనిపించడం లేదు. సీతంపేటకు కూత వేటు దూరంలో ఉన్న పాతపనుకువలస ఉద్యాన కేంద్రం సమీపంలో 2025ఏడాదిలో ఎంఎస్ఎఈ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు అయితే ఏడాది కాలంలో పార్క్‌లో రహదారులు, విద్యుత్, డ్రైన్‌ల నిర్మాణం వంటివి పూర్తిచేశారు. అయితే అవగాహన లేక గిరిజన యువత సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాలేదు. ఐటీడీఏ పరిధిలో ఉన్న పీహెచ్‌సీలకు వైద్యాధికారుల కొరత వెంటాడుతోంది. దీంతో సీజన్‌లో జ్వరపీడితులు, ఇతరాత్ర ఆరోగ్య సమస్యలతో పీహెచ్‌సీలను ఆశ్రయించే రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మలేరియా, వైరల్ జ్వరాలు కూడా గిరిజనులను పట్టీపీడిస్తున్నాయి. గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గిరిబిడ్డల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇంకా ఏఎన్ఎంలను నియమించలేదు.

# భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు.. ప్రైవేట్ కంపెనీలకు అనుమతి..

**న్యూఢిల్లీ:** యుద్ధ సమయంలో ఆయుధాల కొరత ఏర్పడితే ఎంత అధునాతన క్షిపణులు ఉన్నా ప్రయోజనం ఉండదు. అందుకే భారత్ క్షిపణుల తయారీలో కీలక మార్పు చేస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థల ఆధిపత్యంలో ఉన్న ఈ రంగంలోకి ప్రైవేట్ కంపెనీలను కూడా తీసుకొస్తోంది. ప్రతి క్షిపణి వ్యవస్థకు కనీసం ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములు ఉండేలా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రణాళిక వేస్తోంది. దీంతో యుద్ధ సమయంలో ఒకే సంస్థపై ఆధారపడే పరిస్థితి తగ్గనుంది. ఆగస్టులో రక్షణ మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సంప్రదాయ క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన డీఆర్‌డీఓ టెక్నాలజీలను అర్హత ఉన్న భారతీయ రక్షణ కంపెనీలకు బదిలీ చేసేందుకు అనుమతించింది. ప్రైవేట్ సంస్థలు టెక్నాలజీ బదిలీ కోసం పోటీ పడొచ్చు. అలాగే డెవలప్‌మెంట్-కమ్-ప్రొడక్షన్ పార్ట్‌నర్స్' (డీసీపీపీ)గా గుర్తింపు పొందితే క్షిపణుల తయారీలో ప్రధాన వ్యవస్థల సమీకరణ బాధ్యతలు చేపట్టొచ్చు. ఇప్పటివరకు డీఆర్‌డీఓ రూపొందించిన క్షిపణులను ప్రధానంగా ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థలే ఉత్పత్తి చేసేవి. ఇందులో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) కీలకంగా ఉంది. ఇప్పుడు ప్రైవేట్ సంస్థలకు కూడా అవకాశం ఇవ్వడంతో పోటీ పెరగనుంది. దీని వల్ల ధరల నిర్ణయం, సరఫరా సమయం, ఉత్పత్తి సామర్థ్యంలో మెరుగుదల రావొచ్చని నివేదిక పేర్కొంది. దీర్ఘకాలిక యుద్ధంలో క్షిపణులను వేగంగా తయారు చేసి సరఫరా చేయగల సామర్థ్యం కీలకమని నివేదిక తెలిపింది. ప్రతి వ్యవస్థకు ఇద్దరు ఉత్పత్తి భాగస్వాములను ఏర్పాటు చేయడం ద్వారా ఒక సంస్థలో సమస్య వచ్చినా మరో సంస్థ నుంచి తయారీ కొనసాగించే అవకాశం ఉంటుంది. అయితే ప్రైవేట్ రంగం రావడం ప్రభుత్వ రంగాన్ని పక్కన పెట్టడం కాదని నివేదిక స్పష్టం చేసింది. బీడీఎల్‌కు క్షిపణుల తయారీలో అనుభవం, మౌలిక



వసతులు, నైపుణ్యం, సరఫరాదారుల నెట్‌వర్క్ ఉన్నాయని పేర్కొంది.

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన క్షిపణులను తయారు చేసే హక్కు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థలకు ఆటోమేటిక్‌గా దక్కదు. దీంతో గతంలో ఉన్న కేటాయింపు విధానానికి బదులుగా పోటీకి అవకాశం ఏర్పడింది. సంక్లిష్టమైన ఆయుధ వ్యవస్థల్లో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు వేర్వేరు భాగాల్లో ప్రత్యేకత సాధించే కొత్త భాగస్వామ్యాలు కూడా ఏర్పడొచ్చని నివేదిక తెలిపింది.

## అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్న పలు ఆర్థిక మార్పులు




**ముంబై:** అక్టోబర్ నెల గురువారం నుంచి ప్రారంభం కానుండగా, సామాన్యుల ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపే పలు కీలక నిబంధనలు అమల్లోకి రానున్నాయి. బ్యాంకింగ్, పన్నులు, పొదుపు పథకాలు, వంటగ్యాస్ వంటి అనేక రంగాల్లో ఈ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో వినియోగదారులు, పన్ను చెల్లింపుదారులు ఈ కొత్త నియమాలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం.

ఈ మార్పులలో ముఖ్యంగా యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)కి సంబంధించి కొత్త నిబంధన అమల్లోకి వస్తోంది. రూ.2,000 మించిన వ్యాపార (మర్చంట్) లావాదేవీలపై కొత్త 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) ఫ్రేమ్‌వర్క్‌ను వర్తింపజేయనున్నారు. అయితే, ఈ ఛార్జీలను వినియోగదారుల నుంచి వసూలు చేయబోరని, వ్యక్తిగత లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని స్పష్టతనిచ్చారు. మరోవైపు, పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఊరట కల్పించింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి గాను, ట్యాక్స్ ఆడిట్ రిపోర్ట్ దాఖలు గడువును అక్టోబర్ 21కి, ఆదాయపు పన్ను రిటర్నుల (ఐటీఆర్) ఫైలింగ్ గడువును నవంబర్ 21కి పొడిగించింది. గృహ వినియోగదారులకు సంబంధించి ఎల్పీజీ సిలిండర్ బుకింగ్‌లో కీలక మార్పు రాబోతోంది. అక్టోబర్ 1 నుంచి సబ్సిడీ ధరపై గ్యాస్ సిలిండర్ పొందాలంటే తప్పనిసరిగా బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేయాలి. ఈ ప్రక్రియ పూర్తి చేయని వారు మార్కెట్ ధరకు సిలిండర్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) కూడా తన నిబంధనలను సవరించింది. శాలరీ ప్యాకేజీ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో అందించే నెలవారీ ఉచిత లావాదేవీల సంఖ్యను 10 నుంచి 5కి తగ్గించింది. ఈ పరిమితి ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలు రెండింటికీ వర్తిస్తుంది. 'బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్' (బీఎస్‌బీడీ) ఖాతాలకు నెలకు నాలుగు ఉచిత నగదు విత్‌డ్రాలు కొనసాగుతాయి. ఆ తర్వాత చేసే ప్రతి విత్‌డ్రాపై రూ.15తో పాటు జీఎస్టీ విధిస్తారు. వీటితో పాటు, ప్రవాస భారతీయుల నుంచి ఆస్తులు కొనుగోలు చేసేవారు టీడీఎస్ కోసం ప్రత్యేకంగా ట్యాన్ బదులు ప్యాన్ ఉపయోగించుకోవచ్చు. 'నేషనల్ పెన్షన్ సిస్టమ్' (ఎన్‌పీఎస్)లో కొత్తగా చేరేవారికి రూ.200 ఆన్‌బోర్డింగ్ ఛార్జీ అమల్లోకి వస్తుంది. కాగా, ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం అక్టోబర్ 5 నుంచి 7 వరకు జరగనుంది.

## సైబర్ స్టాకింగ్ పెరిగింది.. మహిళలు అప్రమత్తంగా ఉండాలి: ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్



**తిరుపతి, అక్షరప్రభ:** టెక్నాలజీ వినియోగం పెరగడంతో భౌతిక వేధింపుల (ఫిజికల్ స్టాకింగ్) కంటే సైబర్ స్టాకింగ్ (ఆన్ లైన్ వేధింపులు) కేసులు ఎక్కువయ్యాయని, ఆన్‌లైన్ వేధింపుల పట్ల మహిళలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సూచించారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ సహకారంతో రాష్ట్ర మహిళా కమిషన్ నిర్వహించిన 'స్టాకింగ్ నివారణ' అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సోషల్ మీడియా, ఫోన్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా వేధించడం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటివి పెరిగాయని శైలజ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక నంబర్‌ను బ్లాక్ చేసినా కొత్త నంబర్ల నుంచి పదేపదే కాల్స్ లేదా మెసేజ్‌లు రావడం కూడా స్టాకింగ్ కిందకే వస్తుందని వివరించారు. అపరిచితుల నుంచి వచ్చే బహుమతులు, తమ ఫొటోలతో సృష్టించిన నకిలీ సోషల్ మీడియా ప్రొఫైళ్లు, వ్యక్తిగత ఫొటోల దుర్వినియోగంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వేధింపులకు గురైనప్పుడు సామాజిక అపవాదుకు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు లేదా కుటుంబసభ్యులకు తెలియజేయాలని శైలజ సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా సమస్య తీవ్రం కాకుండా నివారించవచ్చన్నారు. ఫిర్యాదు చేసే సమయంలో మహిళా పోలీసు అధికారిని కోరే హక్కు, జీరో ఎఫ్ఐఆర్ ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని చెప్పారు. వీటితో పాటు మానసిక ధైర్యం కూడా చాలా అవసరమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 181 (మహిళా హెల్ప్‌లైన్), 112 (అత్యవసర సేవలు), 1930 (సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్) నంబర్లను, శక్తి యాప్‌ను ఉపయోగించుకోవాలని ఆమె మహిళలకు సలహా ఇచ్చారు. ఇటీవల వైద్య విద్యార్థుల ఆత్మహత్యల పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఆమె, విద్యాసంస్థలు విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించి, కౌన్సెలింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు.

## నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



**కోటబొమ్మాళి, అక్షరప్రభ:** గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వాంద్రాడ గ్రామ పంచాయతీ నర్సింగపల్లిలో రూ.3.92 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌర విద్యుత్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోలార్ వల్ల విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని వివరించారు. నిమ్మాడలోని తన నివాసం, కార్యాలయంపై సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల కరెంటు బిల్లు నెలకు రూ.60వేల నుంచి రూ.1200కు తగ్గిందని వివరించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిమ్మాడలోని పాత పీహెచ్‌సీ భవనంలో మరో వారం పది రోజుల్లో స్కిల్ డెవల ప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించన న్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. స్థానిక పరిశ్రమల అవస రాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి.. ఉద్యోగాలు కల్పిం చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శిక్షణ అనంతరం రూ.20వేల నుంచి రూ. 40వేల వేతనంతో ఉద్యోగ అవ కాశాలు కల్పించేలా పరిశ్రమలతో సమ న్వయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కింజరాపు హరిప్రసాద్, విద్యుత్‌శాఖ ఎస్ఈ జి.ఎస్. ప్రసాద్, నరసింహకుమార్, ఆనంద్, జీవీ ప్రసాద్, కోటేశ్వరరావు, జగదీష్, తహసీల్దార్ ప్రసాద్, నేతలు బోయిన గోవిందరాజులు, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.

## త్వరలో రెండో విడత నామినేటెడ్ పదవుల భర్తీ: పల్లా



**తిరుపతి, అక్షరప్రభ:** త్వరలో రెండో విడత నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. ఏపీలో సీఎం చంద్రబాబు, దేశంలో ప్రధాని మోదీ సుపరిపాలన అందిస్తున్నారని వ్యాఖ్యానించారు. మోదీ సేవా కార్యక్రమాలను తెలియజేస్తూ నాలుగు రాష్ట్రాల్లో బైక్ యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. బుధవారం తిరుపతి అలిపిరి నుంచి సేవా సంకల్ప్ యాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రను పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. మోదీ ప్రజా సేవకు 25 ఏళ్లు పూర్తికావడంతో ఈ యాత్రను చేపట్టారు. 25మంది తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నేతలు బైక్ యాత్రలో పాల్గొంటున్నారు. 8రోజుల పాటు యాత్ర కొనసాగుతుంది. శ్రీవారి ఆశీస్సులు కోరుకుని యాత్ర ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ మీదుగా యాత్ర సాగుతుంది. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో వైసీపీకి తగిన రీతిలో బుద్ధి చెబుతాం.. కూటమి పార్టీల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ నేతలు కుట్రలకు పాల్పడుతున్నారని పల్లా శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. విదేశాల్లో ఫేక్ ఖాతాలు సృష్టించి తెలుగుదేశం, జనసేన పార్టీల మధ్య చిచ్చు పెట్టేలా వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. ప్రజాక్షేత్రంలో వైసీపీకి తగిన రీతిలో బుద్ధి చెప్పే దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తులో భాగంగా గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని మాటిచ్చారు. ఎన్డీఏ కోఆర్డినేషన్ కమిటీ సిఫార్సుల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ, తుది నిర్ణయం ఉంటుందని వెల్లడించారు. గెలుపే ధ్యేయంగా విస్తృత సర్వేల నిర్వహణ, కూటమి నాయకులందరి ఆమోదంతో ముందుకెళ్లే వ్యూహాన్ని రచిస్తున్నామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై ఐక్య ఉద్యమాలు



**శ్రీకాకుళం, అక్షరప్రభ:** విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్మలపై ఐక్యపోరాటాలు చేపడతామని ఎస్ఎఫ్ఐ ఆలిండియా అధ్యక్షుడు ఎం. సాజీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కరించాలని స్కూల్ బచావో ఉద్యమాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలో సప్తగిరి ఫంక్షన్ హాల్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌ను నిర్మించడంలో యువత, విద్యార్థులు పాత్ర కీలకమన్నారు. భగత్‌సింగ్ తన చివరి రోజుల్లో కూడా పుస్తకాలు చదివి సమాజం కోసం ఆలోచిస్తూ తన జీవితాన్ని దేశ ప్రజలకు అంకితం చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థి సమస్యలపై పోరాటం చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ మాట్లా డుతూ.. విద్యార్థి సమస్యలపై మరిన్ని పోరాటాలు చేయాన్నారు. ఢిల్లీ జంతర్‌మంతర్ తరహాలో శ్రీకాకుళంలో విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేపడతామన్నారు. టెక్కలి మండలం రావివలస సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థులు మృతి చెందిన ఘటన తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చందు, జిల్లా కార్యదర్శి పి.ఖగేష్, గర్ల్స్ ప్రతినిధి పి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



**సాలూరు, అక్షరప్రభ:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలు, వార్డులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. సాలూరు పట్టణంలోని సమస్యాత్మక వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారుకు పలు సూచనలిచ్చారు. వార్డుల్లోని శాంతిభద్రతల పరిస్థితి, గతంలో చోటుచేసుకున్న వివాదాలు, తదితర అంశాలను వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక వార్డుల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గత ఎన్నికల సమయంలో వివాదాలకు కారణమైన అంశాలను పరిశీలించాలన్నారు. రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు లొంగరాదని, అన్ని శాఖల సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్స్, స్థానిక రాజకీయ నాయకులకు తరచుగా కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. అవసరమైతే బైండోవర్ నమోదు చేయలన్నారు. ఈ పరిశీలనలో సాలూరు పట్టణ సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## కొంపముంచిన ఆన్‌లైన్ ట్రేడింగ్..
### ఉరివేసుకుని భార్య ఆత్మహత్య.. భార్య మృతి తట్టుకోలేక భర్త బలవన్మరణం



**మార్కాపురం, అక్షరప్రభ:** భార్య ఆత్మహత్య చేసు కోవడంతో కలత చెందిన భర్త గంటలోనే తానూ బలవన్మర ణానికి పాల్పడిన విషాద ఘటన నంద్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం, మార్కాపురం జిల్లా కేంద్రానికి చెందిన కిరణ్ (45), మౌనిక (35) గత 15 ఏళ్లుగా నంద్యాలలోని రోజాకుంటలో నివాసం ఉంటున్నారు. సంజీవనగర్ రామాలయం వద్ద బుక్ స్టోర్ నిర్వహిస్తున్నారు. వారికి సుస్మిత, సురక్ష అనే ఇద్దరు కుమార్తెలున్నారు. ఉదయం వారు పాఠశాలకు వెళ్లగా కిరణ్, మౌనిక దంపతులు ఇంట్లోనే ఉన్నారు. కిరణ్ టిఫిన్ తీసుకురావడానికి బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మౌనిక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అనంతరం భార్య మృతి తట్టుకోలేక భర్త కిరణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య మృతి విషయాన్ని కిరణ్ తన బంధువులకు ఫోన్‌లో చెప్పారు. వారు వచ్చి తలుపు తీసి చూసే సరికి కిరణ్, మౌనిక ఉన్నారు. అప్పటికే మౌనిక మృతి చెందగా కొనఊపిరితో ఉన్న కిరణ్‌ను ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో నష్టపోయిన మౌనిక ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్‌లో రాసింది. తాను ట్రేడింగ్‌లో నష్టపోయాయని చివరకు బంగారు గాజులను బ్యాంకులో తాకట్టు పెట్టి మరీ ట్రేడింగ్ చేశానని అందులో పేర్కొంది. తాను చనిపోతే మీకు ఇన్స్యూరెన్స్ వస్తాయని అందులో ఉన్నట్లు కుటుంబసభ్యుల చెబుతున్నారు. 'నాకు బతకాలని లేదు. నేను నిన్ను చాలా మోసం చేశాను. నాకు బతికే అర్హత లేదు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పిచ్చిలో పడి చాలా డబ్బులు పోగొట్టాను. ఆఖరికి నా బంగారు గాజులు బ్యాంక్?లో తాకట్టు పెట్టి మరీ ట్రేడింగ్ చేశాను. అన్ని డబ్బులు పోయాయి. నేను నా మొఖం చూపించుకునే అర్హత కోల్పోయాను. దయ చేసి నన్ను క్షమించు. నేను చనిపోతే నీకు ఇన్స్యూరెన్స్ వస్తుంది.' అని మౌనిక సూసైడ్ నోట్‌లో రాసింది. ఈ ఘటనపై నంద్యాల రెండో పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. శవపరీక్ష నిమిత్తం దంపతుల మృతదేహాలను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ప్రభుత్వం దృష్టికి తహసీల్దార్ తప్పుడు నివేదిక: ఏబీ వెంకటేశ్వరరావు



**ఎచ్చెర్ల, పతాకం న్యూస్:** ఎచ్చెర్ల తహసీల్దార్ తప్పుడు నివేదిక, అధికార దుర్వినియోగంపై ప్రభుత్వం, ప్రజాప్రతి నిధు లు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. 'రోల్‌బ్యాక్ 22ఎ'లో భాగంగా ఫరీదుపేట గ్రామ పరిధిలోని హైవేకి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 528–34లోని 75 సెంట్ల స్థలాన్ని ఆయన పరిశీలించారు. తమ్మినేని చెల్లన్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆయన సదరు ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. 1977లో తమ్మినేని చెల్లన్నకు అసైన్డ్ ల్యాండ్ 75 సెంట్లను అప్పటి ప్రభుత్వం అందజేసిందని, అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ స్థలంలో ఉన్న గోతులను స్థానిక బీజేపీ నాయ కుడు గ్రావెల్‌తో కప్పి ఆక్రమణకు సిద్ధమయ్యాడని, దీనిపై తమ్మినేని అజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. అయితే సదరు స్థలంపై తహసీల్దార్ తప్పుడు నివేదిక తయారు చేశారని ఆరోపించారు. ఒకపక్క జర్నలిస్టులు, స్థానికులకు స్థలం కేటాయించాలని తీర్మానాలున్నాయని పేర్కొంటూనే మరో పక్క పట్టా రద్దు చేసి 22ఎగా మార్చారని ఆరోపించారు. పట్టా రద్దు చేసినట్లు నోటీసులిచ్చారని, తప్పుడు నివేదికలతో ఈ పట్టా ఎలా రద్దు చేశారని బాధితులు ఆర్డీవో కోర్టులో, హైకోర్టులో తహసీల్దార్‌పై చర్యకు అప్పీల్ చేశారన్నారు. వీరి పోరాటానికి పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. సదరు బీజేపీ నేతతో ప్రాణహాని ఉందని బాధితులు తెలిపా రని, వీరికి రక్షణకు ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం ఇస్తామన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో 7.50 లక్షల ఎకరాల భూమిని 22ఎ బాధితు లకు నాలుగు వారాల్లోగా ప్రభుత్వం అప్పగిస్తామని చెప్పిందని, వారం రోజులే గడువు ఉందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఫర్ లిబర్టీ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చక్రవర్తి ఉన్నారు.

## నాణ్యతగా 'పల్లె పండుగ' పనులు ఉండాలి



**నర్సీపట్నం, అక్షరప్రభ:** గ్రామాల అభివృద్ధికి 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం కింద చేపట్టనున్న పనులు నాణ్యతగా వుండేలా కూటమి శ్రేణులు బాధ్యత తీసుకోవాలని, నాణ్యత విషయంలో రాజీపడవద్దని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. 'వీబీ జీరామ్‌జీ' కార్యక్రమం కింద నాతవరం మండలం డి.యర్రవరంలో 'పల్లె పండుగ 3.0'లో నల్లగొండమ్మతల్లి ఆలయం నుంచి గ్రామం వరకు రూ.60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.16 లక్షలతో గ్రామంలో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, 'పల్లె పండుగ 3.0' కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో వివిధ రకాల రహదారుల నిర్మాణం, రైతులకు ఉపయోగపడే పనుల కోసం పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.11,085 కోట్లు మంజూరు చేశాయని చెప్పారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.5,391 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,694 కోట్లు సమకూర్చాయని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలో 421 పనులకు రూ.43.59 కోట్లు మంజూరయ్యాని చెప్పారు. ఇందులో నాతవరం మండలంలో 148 పనులకు రూ.21.86 కోట్లు, నర్సీపట్నం మండలంలో 104 పనులకు రూ.5.38 కోట్లు, గొలుగొండ మండలంలో 93 పనులకు రూ.6.26 కోట్లు, మాకవరపాలెం మండలంలో 76 పనులకు రూ.10.1 కోట్లు కేటాయించామని తెలిపారు. రానున్న మూడేళ్లలో నర్సీపట్నాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, కూటమి నేతలు గన్నవరం సింగంపల్లి సన్యాసిదేముడు, వెలగా వెంకట కృష్ణారావు, ఎన్.విజయ్‌కుమార్, బెన్నయ్యనాయుడు, ఇనపసప్పల సత్యవతి, అంకంరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 11 కిలోల గంజాయి స్వాధీనం



**నర్సీపట్నం, అక్షరప్రభ:** స్థానిక రైల్వేస్టేషన్ ఫ్లాట్‌పారం–2లో ఓ మహిళ నుంచి మొత్తం ఏడు ప్యాకెట్లలో 11 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఎస్ఐ డి.శ్రీనివాసరావు కథనం మేరకు వివరాలివీ...పశ్చిమ బెంగాల్‌కు చెందిన నుబహార్‌బీబీషేక్ ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసుకొని బెంగాల్ రాష్ట్రానికి తరలించేందుకు స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఫ్లాట్‌పారంపై ఆమె అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో రైల్వే, ఆర్పీఎఫ్ పోలీసులు ప్రశ్నించడంతో పాటు బ్యాగును తనిఖీ చేశారు. దీంతో గంజాయి బయట పడింది. దీన్ని తూకం వేసి కేసు నమోదు చేశారు. విశాఖపట్నం రైల్వే కోర్టులో ఆమెను హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులు నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం వంటి చట్టపరమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

## పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా సచిన్ రహర్

**పార్వతీబీపురం, అక్షరప్రభ:** పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా 2024 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సచిన్ రహర్ నియామకమయ్యారు. అక్టోబరు ఒకటో తేదీన బాధ్యతలు స్వీకరించనున్నారు. హర్యానాలో భవానీ జిల్లా లోహరుకు చెందిన ఆయన ఢిల్లీ యూనివర్సిటీలో బీఎస్సీ, జవహర్‌లాల్‌నెహ్రూ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశారు. 2022లో యూపీఎస్సీలో 176 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఏపీ క్యాడర్‌కు ఆయన్ని కేటాయించగా.. ప్రస్తుతం అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్‌గా అనంతపురం జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన తండ్రి వీర్‌సింగ్ మిలటరీ ఇంజనీరింగ్ సర్వీస్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, తల్లి రజబాల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం పార్వతీపురం ఆర్డీవోగా, పురపాలక సంఘం ప్రత్యేక అధికారిగా విధులు నిర్వహిస్తున్న మాధురి జిల్లాకు వచ్చి నాలుగు నెలలు కాకముందే బదిలీ అయ్యారు.

(మొదటిపేజీ తరువాయి)

## సేవా స్ఫూర్తి.. యువతకు ఆదర్శం మాదల చైతన్య

కూడా మాదల చైతన్య చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఉందని తెలిపారు. గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో గణపతి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించిన సందర్భాలను నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తావించారు. భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రజలతో మరింతగా మమేకం కావచ్చని వారు పేర్కొన్నారు.

**ఆపదలో అంటే చాలు.. ఆర్థిక చేయూత....**

అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారికి కొంతమేర అండగా నిలుస్తున్నారని నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఇటీవల నల్లచెరువు ప్రాంతానికి చెందిన కానుమోలు హారిక కుటుంబాన్ని పరామర్శించి వైద్య చికిత్స కోసం రూ.50 వేల ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు. వైద్య చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో తనవంతు సహకారం అందించినట్లు మాదల చైతన్య తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు.

యువత కేవలం వ్యక్తిగత అభివృద్ధిపైనే కాకుండా సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలోనూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని సమావేశంలో చర్చ జరిగింది. విద్య, క్రీడలు, ఆరోగ్యం, ఉపాధి, సామాజిక సేవ వంటి రంగాల్లో యువత చురుకుగా పాల్గొంటే సమాజానికి ఉపయోగకరమైన మార్పులు తీసుకురావచ్చని మాదల చైతన్య పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన యువతను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించడం కూడా సమాజం పట్ల ఉన్న బాధ్యతలో భాగమని మాదల చైతన్య తెలిపారు.

మాదల చైతన్య చేపడుతున్నట్లు పేర్కొన్న వివిధ సేవా కార్యక్రమాలను గుర్తించిన నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ (చీూ=ూ) ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్‌వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు, వార్తా ప్రపంచం చీఫ్ ఎడిటర్ డాక్టర్ బండి సురేంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి & న్యూస్ ఫ్రెండ్ చీఫ్ ఎడిటర్ మద్దినేని. మానస, నేషనల్ సెక్రటరీ & ఎల్లో సింగం చీఫ్ ఎడిటర్ సూర్య చౌదరి, స్కాలర్స్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ఇమ్మానుయేల్, అక్షరసత్యం అసోసియేట్ ఎడిటర్ సలవాది రాజేష్, నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నారిమళ్ల అనిల్‌కుమార్, రెడ్డి నరేంద్ర, ఎస్.కె. మహబూబ్ సుభాని, నవీన్, అంజి, ఆరుద్ర, ప్రదీప్ చౌదరి, వాసు, శ్రీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. మాదల చైతన్యతో ఆత్మీయంగా సమావేశమైన వారు ప్రజా సమస్యలు, సామాజిక సేవ, యువత పాత్ర, క్రీడాకారులకు ప్రోత్సాహం వంటి అంశాలపై చర్చించారు.

**మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్ష.....**

ఈ సందర్భంగా డాక్టర్ బండి సురేంద్రబాబు మాట్లాడుతూ, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం, ప్రతిభ ఉన్నవారిని ప్రోత్సహించడం, విద్యార్థులు మరియు క్రీడాకారులకు సహాయం అందించడం వంటి కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మాదల చైతన్య భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి యువతను కూడా సామాజిక సేవలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. యువతకు ఆదర్శంగా నిలిచేలా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

క్రీడాకారుడి ప్రతిభను ప్రోత్సహించడం నుంచి విద్యార్థికి ఆర్థిక సహాయం అందించడం వరకు, వైద్య శిబిరాల నిర్వహణ నుంచి అన్నదాన కార్యక్రమాల వరకు, అవసరంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించడం వరకు వివిధ కార్యక్రమాలను కొనసాగిస్తున్న మాదల చైతన్య సేవా కార్యక్రమాలను నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. ప్రజా అవసరాలను గుర్తించి సాధ్యమైనంత సహాయం అందించే కార్యక్రమాలు కొనసాగాలని, సమాజంలో సేవా స్ఫూర్తిని మరింత విస్తరించేలా యువత ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీలు దోహదం

**పాడేరు, అక్షరప్రభ:** స్కూల్ యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లు పాఠశాలల అభివృద్ధికి దోహదపడతాయని కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. పాడేరులోని గుడివాడ మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో జరిగిన స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కమిటీలు పాఠశాలల్లో స్థితిగతులను పరిశీలించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎంసీ చైర్మన్‌గా అన్నంరెడ్డి సావిత్రి, వైస్‌చైర్మన్‌గా పాంగి కృష్ణ, సుమారు 15 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన ఎస్ఎంసీతో మండల విద్యాశాఖాధికారి బి.విశ్వనాథం ప్రమాణ స్వీకారం చేయించారు. గుడివాడ స్కూల్లో ఎస్ఎంసీ ఎన్నికలు అనంతరం కలెక్టర్ టి.నిషాంతి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తర్వాత విద్యార్థులకు ఆమె స్వయంగా ఆహార పదార్థాలు వడ్డించి, ఆమె కూడా వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులందర్నీ ఆమె పలకరించడంతో వారంతా ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

# అమెరికాలో గ్రీన్ కార్డ్ ఇక మరింత ప్రియం.. ఇన్వెస్టర్ వీసా ఫీజులు రెట్టింపు.. భారతీయులపై ప్రభావం!




**న్యూయార్క్:** అమెరికాలో పెట్టుబడులు పెట్టి, శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) పొందాలనుకునే విదేశీయులకు, ముఖ్యంగా భారతీయులకు ఇది కీలకమైన పరిణామం. భారతీయ పారిశ్రామికవేత్తలు, కుటుంబాలు ఎక్కువగా ఆసక్తి చూపే ఈబీ-5 ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ ఫీజులను భారీగా పెంచుతూ అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త ఫీజుల నిబంధనను యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఖరారు చేసింది. నూతన ఫీజులు ఈ ఏడాది నవంబర్ 30 నుంచి అమల్లోకి రానున్నాయి. అమెరికాలో పెట్టుబడులు పెట్టడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, అమెరికన్లకు ఉద్యోగాలు కల్పించడం లక్ష్యంగా 1990లో ఈబీ-5 ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ పథకం కింద విదేశీ పెట్టుబడిదారులు అమెరికాలోని వాణిజ్య సంస్థలలో నిర్దిష్ట మొత్తంలో పెట్టుబడి పెట్టి, కనీసం 10 మంది అమెరికన్లకు పూర్తికాల ఉద్యోగాలు కల్పించాలి. ప్రస్తుతం ఈ పెట్టుబడి మొత్తం అర్హత కలిగిన వ్యాపారంలో 1.05 మిలియన్ డాలర్లుగా, టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియా లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులలో అయితే 8 లక్షల డాలర్లుగా ఉంది. ఈ నిబంధనలు పాటిస్తే, పెట్టుబడిదారుడు, వారి జీవిత భాగస్వామి, అర్హులైన పిల్లలు గ్రీన్ కార్డ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. యూఎస్‌సీఐఎస్ తాజా నిర్ణయంతో దరఖాస్తు ఫీజులు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయి. ఫీజుల పెంపుపై యూఎస్‌సీఐఎస్ ఒక ప్రకటనలో వివరణ ఇచ్చింది. తమ ఏజెన్సీకి ప్రభుత్వ పన్నుల ద్వారా కాకుండా, దరఖాస్తుదారులు చెల్లించే ఫీజుల ద్వారానే అధికశాతం నిధులు సమకూరుతాయని స్పష్టం చేసింది. దరఖాస్తుల సమీక్ష, నేపథ్య పరిశీలన, అర్హత నిర్ధారణ, మోసాల గుర్తింపు, కార్యక్రమ నిర్వహణ వంటి ఖర్చులను భరించేందుకే ఈ పెంపు తప్పనిసరైందని తెలిపింది. గత దశాబ్దకాలంగా భారత్ నుంచి ఈబీ-5 వీసాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో దరఖాస్తుల సంఖ్య పెరిగి, గ్రీన్ కార్డ్ కోసం వేచి చూసే సమయం కూడా ఎక్కువైంది. తాజా ఫీజుల పెంపుతో ఈ మార్గంలో అమెరికా వెళ్లాలనుకునే భారతీయ పెట్టుబడిదారులపై అదనపు ఆర్థిక భారం పడనుంది.

# టేకు వనాలకు తెగులు

## కలప నాణ్యత దెబ్బతింటుందంటున్న శాస్త్రవేత్తలు.. నివారణ చర్యలు చేపట్టాలని సూచన

**చింతపల్లి, అక్షరప్రభ:** మన్యంలోని టేకు వనాలకు తెగులు సోకింది. చెట్లను స్కెల్టోనైజర్ కీటకం(లార్వా) ఆశించడంతో ఆకుల రంగు మారిపోయింది. ఈ కీటకం ఆశించడం వల్ల కలప నాణ్యత దెబ్బతింటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సుమారు ఎనిమిదేళ్ల తరువాత ఈ కీటకం వనాలపై మళ్లీ కనిపించింది. సాధారణంగా ఈ సీజన్‌లో టేకు వనాలు పచ్చగా ఉంటాయి. అయితే ఈ కీటకం ఆశించడంతో చెట్ల ఆకులు స్వర్ణ వర్ణంలోకి మారిపోయాయి. ఈ కీటకం నివారణకు చర్యలు చేపట్టకపోతే చెట్ల ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గిరిజన ప్రాంతంలో సుమారు 1973-74 ప్రాంతం నుంచి అటవీశాఖ పాడేరు, చింతపల్లి డివిజన్ల పరిధిలో టేకు ప్లాంటేషన్ సాగు చేస్తున్నది. అటవీశాఖ పరిధిలో రూ.లక్షల విలువ చేసే పురాతన టేకు వనాల ప్లాంటేషన్లు ఉన్నాయి. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(ఏపీఎఫ్‌డీసీ), గిరిజన రైతులు సైతం తక్కువ విస్తీర్ణంలో టేకును సాగు చేసుకుంటున్నారు. మార్కెట్‌లో టేకు కలపకు మంచి డిమాండ్ ఉంది. రైతులు నాటుకున్న టేకు వనాలను సైతం కలపగా వినియోగించుకునేందుకు అటవీశాఖ, కలెక్టర్ అనుమతి ఉండాలి. అటవీశాఖ, ఏపీఎఫ్‌డీసీ, గిరిజన రైతులకు టేకు వనాల నుంచి మంచి ఆదాయం వస్తున్నది. టేకు మొక్కలకు పెద్దగా సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం లేదు. మొక్క దశలో మూడేళ్లపాటు కాపాడుకుంటే మహా వృక్షాలవుతాయి. టేకు వనాలు ఏ దశలో ఉన్నప్పటికి స్కెల్టోనైజర్ కీటకాలు ఆశించవచ్చు. చింతపల్లి, పాడేరు డివిజన్ పరిధిలో టేకు వనాల్లో స్కెల్టోనైజర్ కీటకాలు 2018 సెప్టెంబరులో కనిపించాయి. సుమారు ఎనిమిదేళ్ల తరువాత మళ్లీ టేకు వనాలు, మొక్కల్లో ఈ కీటకం కనిపించింది. టేకు వనాలను ఆశించే స్కెల్టోనైజర్ లార్వా(కీటకం) ఆకులపై పత్రహరితాన్ని పీల్చివేస్తుంది. ఈ లార్వా ఉధృతి పెరగడం వల్ల ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న టేకు వనాల ఆకులు వర్షాకాలంలో



స్వర్ణవర్ణంలోకి మారి రాలిపోయాయి. మళ్లీ మార్చి, ఏప్రిల్ వచ్చే వరకు టేకు వనాల్లో పచ్చని ఆకులు కనిపించే పరిస్థితి లేదు. స్కెల్టోనైజర్ కీటకం వల్ల వనాలకు పెద్దగా నష్టంలేకపోయినప్పటికి కలప నాణ్యత దెబ్బతింటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కల దశలో స్కెల్టోనైజర్ వ్యాప్తి చెందితే ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. టేకు వనాలు స్వర్ణ వర్ణంలోకి మారిపోవడానికి స్కెల్టోనైజర్ కీటకం ప్రధాన కారణమని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బాబూజి నాయుడు తెలిపారు. ఈ లార్వా(కీటకం) ఆకులపై ఉన్న పత్రహరితాన్ని గోకి తినివేస్తుందని చెప్పారు. ఆకుల్లో చిన్న, పెద్ద ఈనెలు మాత్రమే మిగులుతాయని, ఆకులను దగ్గరగా చూస్తే ఒక జల్లెడ మాదిరిగా కనిపిస్తుందన్నారు. ఉదయం, సాయంత్రం స్వర్ణ వర్ణంలో కనిపించే ఆకులపై ఉన్న లార్వాను ఇష్టంగా తీనేందుకు పక్షులు పెద్ద సంఖ్యలో వస్తున్నాయన్నారు. లార్వా వల్ల వృక్షాలకు పెద్దగా హానికలగదని, పదేళ్లలోపు మొక్కలకు ఈ లార్వా సోకితే ఎదుగుదలపై ప్రభావం చూపుతుందన్నారు. లార్వా నివారణకు క్లోరోపైరిఫాస్ మందును 2ఎంఎల్ లీటరు నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలని, ఎకరానికి 40 లీటర్లు అవసరముంటుందని ఆయన చెప్పారు.




# రెండో వన్డేలో.. భారీ స్కోరు దిశగా వెస్టిండీస్







గువాహటి వేదికగా భారత్-వెస్టిండీస్ జట్ల రెండో వన్డేలో టాస్ నెగ్గిన భారత్.. ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో విండీస్ తొలుత బ్యాటింగ్‌కు దిగి 41.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 347 పరుగులు చేసి భారీ స్కోరు దిశగా పయనిస్తుంది. గువాహటి వేదికగా భారత్‌తో జరుగుతున్న రెండో వన్డేలో వెస్టిండీస్ ఓపెనర్ జాన్ క్యాంప్‌బెల్ విధ్వంసకర శతకంతో చెలరేగాడు. భారత బౌలర్లపై ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగిన క్యాంప్‌బెల్, కేవలం 65 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. తద్వారా భారత్‌పై అత్యంత వేగంగా సెంచరీ నమోదు చేసిన వెస్టిండీస్ ఆటగాడిగా సరికొత్త రికార్డు సృష్టించాడు. అంతకుముందు టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఇన్నింగ్స్ ప్రారంభించిన చెలరేగిన క్యాంప్‌బెల్, కేవలం 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. అదే దూకుడు కొనసాగిస్తూ శతకం పూర్తి చేసుకున్నాడు. మొత్తం 68 బంతుల్లో 101 పరుగులు చేసిన అనంతరం క్యాంప్‌బెల్ ఔటయ్యాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ చెరో వికెట్ పడగొట్టారు. ఈ మ్యాచ్‌తో భారత జట్టులోకి యువ పేసర్ అకీబ్ నబీ అరంగేట్రం చేశాడు. ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో అతనికి తుది జట్టులో చోటు దక్కింది. మరోవైపు వెస్టిండీస్ తమ జట్టులో నాలుగు మార్పులతో బరిలోకి దిగింది. కెప్టెన్ షాయ్ హోప్ (45), అమీర్ జంగూ(11) క్రీజులో ఉన్నారు. కాగా టీమిండియాలో ఆకిబ్ నబీ వన్డేల్లోకి అరంగేట్రం చేయనున్నాడు. నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో నబీని ఆడించనున్నట్లు గిల్ వెల్లడించాడు. కాగా తొలి వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

మూడు వన్డేల సిరీస్‌లో 1-0 తేడాతో భారత్ ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్ పట్టేయాలని భారత్ పట్టుదలతో ఉంది. **భారత తుది జట్టు:** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), నమన్ ధీర్, రవీంద్ర జడేజా, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ

# ఆసియా క్రీడలు.. కాంపౌండ్ ఆర్చరీలో భారత్‌కు మరో స్వర్ణం



ఆసియా క్రీడలు 2026లో భారత అథ్లెట్ల జోరు కొనసాగుతోంది. కాంపౌండ్ ఆర్చరీలో భారత్‌కు మరో స్వర్ణ పతకం లభించింది. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో చికితా తానిపర్తి, సాహిల్ జాదవ్ జోడీ పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన ఫైనల్లో దక్షిణ కొరియాకు చెందిన పార్క్ జంగ్యూన్, చోయ్ యోంగ్‌హీ జోడీని షూట్‌ఆఫ్‌లో ఓడించి భారత్ స్వర్ణం సాధించింది. హోరాహోరీగా సాగిన ఫైనల్ 157-157తో సమం కావడంతో విజేతను నిర్ణయించేందుకు షూట్‌ఆఫ్ నిర్వహించారు. ఈ సమయంలో చికిత, సాహిల్ ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా బుల్స్‌ఐని కొట్టారు. కొరియా తొలి ప్రయత్నంలో 9 పాయింట్లు మాత్రమే సాధించడంతో భారత్ స్వర్ణం ఖరారైంది. ఫైనల్లో భారత్ ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి సెట్‌ను 40-39తో గెలిచిన చికిత, సాహిల్ జోడీ.. రెండో సెట్‌లోనూ 40-39తో విజయం సాధించింది. దీంతో భారత్ 80-78తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే కొరియా జోడీ పుంజుకుని.. మూడో సెట్‌ను 39-38తో, నాలుగో సెట్‌ను 40-39తో సొంతం చేసుకుంది. దీంతో మొత్తం స్కోరు 157-157తో సమమైంది. చివరకు షూట్‌ఆఫ్‌లో భారత్ విజేతగా నిలిచింది. ఈ స్వర్ణంతో భారత్ ఖాతాలో పతకాల సంఖ్య 55కు చేరింది. ఇందులో ఎనిమిది స్వర్ణాలు ఉన్నాయి. అంతేకాదు.. ఈ విజయంతో 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు భారత్ తన కోటాను కూడా ఖరారు చేసుకుంది. అంతకుముందు మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలోనూ భారత్ స్వర్ణ పతకం సాధించిన సంగతి తెలిసిందే. చికిత తానిపర్తి, జ్యోతి సురేఖ, ప్రతీకా ప్రదీప్ బృందం ఫైనల్లో చైనాను 238-234తో ఓడించింది. అయితే గంటల వ్యవధిలోనే బ్యాక్ టూ బ్యాక్ ఆర్చరీలో రెండు స్వర్ణాలు రావడం విశేషం.

# ముల్తానీ మట్టితో ప్రయోజనాలెన్నో?

ముల్తానీ మట్టి.. అందం కోసం పరితపించేవారికి దీని గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. చర్మానికి మేలు చేసే ఈ మట్టి లేనిదే బ్యూటీ ప్రొడక్ట్లే లేవు. ఎలాంటి రసాయనాలు లేని ఈ స్వచ్ఛమైన మట్టిలో ఉండే సహజ ఖనిజాలే.. చర్మానికి రక్షణ కలిగిస్తాయి. కాసుల వర్షం కురిపిస్తున్న ఈ మట్టి ఎక్కడ లభిస్తుందో తెలుసా?

ఇలాంటి మట్టి ప్రపంచంలో చాలా ప్రాంతాల్లో లభిస్తుంది. అయితే, పాకిస్థాన్‌లోని ముల్తాన్‌లో ఉండే మట్టి మాత్రమే మేలైనదని భావిస్తున్నారు. అందుకే, ఎక్కువ మంది ముల్తాన్‌లో లభించే మట్టిని సేకరించేందుకు ఎక్కువ శ్రద్ధ చూపుతున్నారు. అందుకే ఈ మట్టిని 'ముల్తానీ మిట్టీ లేదా ముల్తానీ మట్టి' అని పిలుస్తారు. అయితే, ఈ మట్టి వల్ల చర్మానికి ఎలాంటి సమస్య ఉండదు. బ్రాండెడ్ సంస్థలు విక్రయించే మట్టిని కొనడమే మేలు.

ముల్తానీ మట్టిలో మెగ్నీషియం, క్వార్ట్జ్, సిలికా, ఇనుము, కాల్షియం, కాల్సైట్, డోలమైట్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ మట్టి ఎక్కువగా పౌడర్ రూపంలోనే లభిస్తుంది. తెలుగు, నీలం, ఆకుపచ్చ, గోదుమ రంగుల్లో ఎక్కువగా లభిస్తుంది. చర్మం, జుట్టు సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ముల్తానీ మట్టి ఒక వరం. మరి, ఈ మట్టి వల్ల ఎన్ని రకాల ప్రయోజనాలు ఉన్నాయో చూసేద్దామా!

జిడ్డును గ్రహిస్తుంది: సాధారణంగా మట్టికి పీల్చే గుణం ఎక్కువ. అందుకే, ముల్తానీ మట్టిని ముఖానికి రాయగానే ముందుగానే చర్మాన్ని జిడ్డులా మార్చే నూనెలను పీల్చేస్తుంది. చర్మ రంధ్రాల్లో క్లాగ్ లేకుండా చూస్తుంది. చర్మం పీహెచ్ (%జూన%) స్థాయిలను సమతుల్యం చేస్తుంది. అందుకే, ఎక్కువ మంది దీన్ని ఫేస్‌ప్యాక్‌గా వినియోగిస్తారు. చర్మంపై మచ్చలను తొలగించేందుకు ఇది మంచి ఔషధం.

మొటిమలు మటుమాయం: మొటిమలను తొలగించడంలో ముల్తానీ మట్టి బాగా ఉపయోగపడుతుంది. చర్మంపై జిడ్డుగారే నూనెల వల్ల మొటిమలు ఏర్పడతాయనే సంగతి తెలిసిందే. ముల్తానీ మట్టిని ముఖానికి రాసినట్లయితే జిడ్డు మాయమవుతుంది. అలాగే, మొటిమల వల్ల ముఖంపై ఏర్పడు గుంటలను కూడా తొలగిస్తుంది. చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది.

చర్మానికి మంచి రంగు ఇస్తుంది: మీ మేను మెరవాలంటే.. ముల్తానీ మట్టిని రాయాల్సిందే. దీన్ని మీ చర్మానికి పూసుకోవడం ద్వారా రంగు మారుతుంది. డార్క్ స్కిన్‌తో బాధపడేవారికి ఇది ఉపయోగపడుతుంది. మరీ తెల్లగా మార్చుకున్నా.. చర్మాన్ని కాంతివంతంగా కనిపించేందుకు సహకరిస్తుంది. చర్మంపై ఉండే మృత కణాలను తొలగిస్తుంది.

చుండ్రు నుంచి ఉపశమనం: చుండ్రు సమస్యతో బాధపడుతున్నట్లయితే ముల్తానీ మట్టిని ట్రై చేయండి. చుండ్రుకు కారణమయ్యే గ్రీజు, దూళిని ఈ మట్టి గ్రహిస్తుంది. తల చర్మంలోని రక్త ప్రసరణ మెరుగుపరుస్తుంది. 20 నిమిషాల తర్వాత మట్టిని షాంపూతో శుభ్రం చేయాలి. ఆ తర్వాత కండీషనర్ రాసుకోవాలి. దీనివల్ల జుట్టు చిట్లకుండా ఆరోగ్యకరంగా ఉంటుంది.



## ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యం



**శృంగవరపుకోట, అక్షరప్రభ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరిం చుకుని చేపడుతున్న సేవా సంకల్ప్ అభియాన్-2026లో భాగంగాఎస్.కోట ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించారు. వీటికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. టీబీ బాధితులకు మందులతో పాటు రూ.1000 చొప్పున పోషకాహార భృతి అందిస్తున్నట్టు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు డోకుల చినఅచ్చంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ జీఎస్ నాయుడు, దాసరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు నానిగిరి రమణాజీ, బంగారు నాయుడు, చెక్కా కిరణ్‌కుమార్, బీజేపీ నాయకుడు కొట్యాడ లోకాభిరామకోటి, సూపరింటెండెంట్ నీల, వైద్యుడు మల్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

## నా ఆస్తులు రూ.1,400 కోట్లు.. అన్నీ చట్టబద్ధమే: డీకే శివకుమార్

**కర్ణాటక:** తన ఆస్తుల విషయంలో కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి చేస్తున్న ఆరోపణలపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఘాటుగా స్పందించారు. తన ఆస్తులన్నీ చట్టబద్ధంగా సంపాదించినవేనని, ఆదాయపు పన్ను శాఖకు అన్ని వివరాలు వెల్లడించానని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, కుమారస్వామిపై ఎదురుదాడికి దిగారు. "అవును, ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నాకు రూ.1,400 కోట్ల ఆస్తులు ఉన్నాయి. అవన్నీ చట్టపరిధిలోనే సంపాదించాను. కుమారస్వామి నిరాశ, నిస్పృహలతో ఇలా మాట్లాడుతున్నారు" అని శివకుమార్ అన్నారు. బీజేపీ-జేడీఎస్ కూటమిలో నెలకొన్న అంతర్గత విభేదాలే కుమారస్వామి అసహనానికి కారణమని ఆయన ఆరోపించారు. నైస్ ప్రాజెక్టుపై కుమారస్వామిని శివకుమార్ నిలదీశారు. "ఆయన తండ్రి హెచ్.డి.దేవెగౌడ ఆ ప్రాజెక్టు ఒప్పందంపై సంతకం చేశారు. కుమారస్వామి కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అప్పుడు ఈ విషయంపై ఎందుకు మౌనంగా ఉన్నారు? గాంధీ అనే వ్యక్తికి టెండర్ కట్టబెట్టాలని ప్రయత్నించి, కోర్టుతో మొట్టికాయలు కూడా తిన్నారు. బినామీ పేర్లతో ఎన్నో లావాదేవీలు జరిగాయి. ఆయనలా నేను పేర్లు చెప్పాలనుకోవడం లేదు" అని విమర్శించారు. ఒక రైతు కుమారుడిగా, పారిశ్రామికవేత్తగా తాను ఆస్తులు సంపాదించడంలో తప్పేంటని శివకుమార్ ప్రశ్నించారు. "నాకు ఆస్తులు ఉండకూడదా? నా పిల్లలు ఆస్తులు కొనకూడదా? చట్టం అనుమతించిన మేరకే అన్నీ చేశాను. కుమారస్వామి ఏమైనా ఐటీ అధికారా? ఆయన దగ్గర సమాచారం ఉంటే ఆదాయపు పన్ను శాఖకు ఇవ్వమనండి" అని సవాల్ విసిరారు.

## ఇండియన్ కోస్ట్‌గార్డ్ మెగా ఆపరేషన్.. అరేబియా సముద్రంలో రూ.3వేల కోట్ల డ్రగ్స్ సీజ్.. ఐదుగురు పాకిస్థానీయులు అరెస్టు



**న్యూఢిల్లీ:** అరేబియా సముద్రం మీదుగా భారత్‌కు భారీ మొత్తంలో డ్రగ్స్‌ను తరలిస్తున్న పాకిస్థాన్ ముఠా గుట్టును ఇండియన్ కోస్ట్ గార్డ్స్ రట్టు చేసింది. భారత కోస్ట్ గార్డ్, గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) సంయుక్తంగా చేపట్టిన చర్యలో ఇరాన్‌కు చెందిన ఓ పడవ నుంచి భారీగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. మొత్తం 526 కిలోల మెథాంఫెటమైన్, హెరాయిన్ సీజ్ చేశాయి. వీటి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.3,000 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు తెలిపారు. పడవలో ఉన్న ఐదుగురు పాకిస్థానీ పౌరులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు కోస్ట్ గార్డ్ వెల్లడించింది. లక్షద్వీప్‌కు పశ్చిమాన అరేబియా సముద్రంలో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు భారత కోస్ట్ గార్డ్ తెలిపింది. విశ్వసనీయ నిఘా సమాచారంతో అనుమానాస్పదంగా కదులుతున్న ఓ ధావ్ పడవను భద్రతా బలగాలు గుర్తించాయి. సముద్ర, వైమానిక నిఘా వ్యవస్థల ద్వారా పడవ కదలికలను నిరంతరం పర్యవేక్షించిన అధికారులు, అనంతరం దాన్ని వెంబడించారు. అనుమానాస్పద పడవను నిలువరించిన తర్వాత కోస్ట్ గార్డ్ సిబ్బంది అందులోకి ప్రవేశించి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భారీగా మాదకద్రవ్యాలు బయటపడటంతో పాటు పడవలో ఉన్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల్లో అధిక నాణ్యత కలిగిన మెథాంఫెటమైన్, హెరాయిన్ ఉన్నట్లు కోస్ట్ గార్డ్ పేర్కొంది. పట్టుబడిన డ్రగ్స్ మొత్తం 526 కిలోలుగా గుర్తించారు. సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి సింథటిక్ డ్రగ్స్‌ను తరలించే అంతర్జాతీయ నెట్‌వర్క్‌కు ఈ సరుకు సంబంధించి ఉండొచ్చన్న అనుమానంతో దర్యాప్తు చేపడుతున్నారు. అయితే డ్రగ్స్ మూలం, గమ్యస్థానం, వాటి వెనుక ఉన్న నెట్‌వర్క్‌కు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఆపరేషన్ అనంతరం ఇరాన్ పడవను, అందులోని సిబ్బందిని, స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాలను సాయుధ భద్రత మధ్య ముంబయికి తరలించారు. అక్కడ సంయుక్తంగా విచారణ చేపట్టడంతో పాటు తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించనున్నట్లు కోస్ట్ గార్డ్ తెలిపింది. పడవలోని వ్యక్తుల నేపథ్యం, డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనే అంశాలపై దర్యాప్తు కొనసాగనుంది. ముంబయి తరలించిన తర్వాత చేపట్టే సంయుక్త విచారణలో ఈ వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## వీరమాచినేని రామకృష్ణపై క్రిమినల్ కేసు



**హైదరాబాద్, అక్షరప్రభ:** తెలుగు రాష్ట్రాల్లో 'వీఆర్కే డైట్' సృష్టికర్తగా సుపరిచితులైన వీరమా చనేని రామకృష్ణపై సైబరాబాద్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఆయన ఇచ్చిన తప్పుడు వైద్య సలహా కారణంగా తన ప్రాణాల మీదకు వచ్చిందని ఓ లా విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, నిర్మల్ జిల్లాకు చెందిన 30 ఏళ్ల కల్లెడ సాయికృష్ణ టైప్-1 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. సోషల్ మీడియాలో వీరమాచనేని వీడియోలు చూసి, తన వ్యాధి నయమవుతుందని నమ్మి హైదరాబాద్‌లోని షేక్‌పేటలో ఉన్న వీఆర్కే హెల్త్ కేర్ సెంటర్‌ను సంప్రదించారు. అక్కడ వీరమాచనేని, ఆయన సహాయకుడు కోటేశ్వరరావు తనను ఇన్సులిన్ వాడకాన్ని ఆపేయాలని సూచించినట్లు సాయికృష్ణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకోసం వారు రూ. 26,000 ఫీజుగా వసూలు చేశారని తెలిపారు. వారి సలహా పాటించిన రెండు రోజులకే సాయికృష్ణ ఆరోగ్యం తీవ్రంగా విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు అతన్ని సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా, డయాబెటిక్ కీటోఎసిడోసిస్‌తో పాటు తీవ్రమైన డీహైడ్రేషన్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. తాను మోసపోయానని గ్రహించిన సాయికృష్ణ, వీరమాచనేని, కోటేశ్వరరావుపై రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు చీటింగ్, ప్రాణాలకు హాని కలిగించడం, నేరపూరిత కుట్ర వంటి పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## స్థానిక ఎన్నికలపై 'ఆ ప్రచారం' నమ్మొద్దు

**అమరావతి, అక్షరప్రభ:** రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తప్పుడు వార్తలు, నకిలీ పత్రాలతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రజలకు, రాజకీయ పార్టీలకు సూచించింది. ఈ విధమైన ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించి ఎన్నికల సంఘం పేరుతో వచ్చే అనధికార సమాచారాన్ని ప్రజలు, మీడియా ప్రతినిధులు నమ్మవద్దని అధికారులు స్పష్టంచేశారు. వివిధ వాట్సాప్ గ్రూపుల్లో మరో తప్పుడువార్త ప్రచారంలోకి వచ్చింది. స్థానికసంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి మరో 2 నెలల పడుతుందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపినట్లుగా పేర్కొన్నారు. ఎన్నికల రోల్స్‌కు సంబంధించిన కోర్టు కేసుల్లో క్లియరెన్స్ వచ్చిన తర్వాతనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రచారం చేశారు. ఎన్నికలు ఆలస్యమైనప్పటికీ అంతర్గత ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఈ సమాచారం రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసింది కాదు. ఎన్నికల సంఘం పేరుతో నకిలీ, తప్పుదారి పట్టించే లేదా అనధికార సమాచారాన్ని ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం." అని ఎన్నికల సంఘం హెచ్చరించింది.




# నాని సినిమాలో హీరోయిన్‌గా 'మీనాక్షి చౌదరి'



నాని వరుస సినిమాలతో బిజీ గా ఉన్నారు. ప్రస్తుతం 'ది పారడైస్' సక్సెస్ ను ఆస్వాదిస్తున్న ఆయన త్వరలో సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' సినిమా చేయబోతున్నారు. 'ఓజీ' తర్వాత సుజీత్ తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ క్రేజీ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'బ్లడీ రోమియో'లో నాని సరసన హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కోసం ఆమెను సంప్రదించినట్లు తెలిసింది. అయితే దీనిపై అధికారిక ప్రకటన లేదు. మరోవైపు నాని అభిమానులు మాత్రం తమకు నచ్చిన హీరోయిన్ పేర్లను సోషల్ మీడియాలో వేదికగా షేర్ చేస్తున్నారు. మీనాక్షి చౌదరితో పాటు భాగ్యశ్రీ బోర్సే, మమితా బైజు, వామికా గబ్బి పేర్లు కూడా అభిమానులు సూచిస్తున్నారు. అయితే వీరిలో నాని సరేనా ఎవరు జోడి కడతారనేది ఆసక్తికరంగా మారింది.

అయితే మేకర్స్ దృష్టి మాత్రం మీనాక్షి చౌదరి పైనే ఉందని సమాచారం. నాని కోసం సుజీత్ ఎలాంటి కథను సిద్ధం చేశారు? ఆయన పాత్ర ఎలా ఉండబోతోంది? యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాలో నాని లుక్, క్యారెక్టరైజేషన్ ఎలా ఉండబోతున్నాయనే విషయాలపై అభిమానుల్లో చర్చ జరుగుతోంది. ఈ చిత్రాన్ని నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందించనున్నారు.

# 'స్లమ్‌డాగ్' నుంచి కొత్త గ్లింప్స్ విడుదల



పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో, విలక్షణ నటుడు విజయ్ సేతుపతి హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్'. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి మేకర్స్ ఓ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి తల్లి పాత్రలో సీనియర్ నటి జరీనా వహాబ్ నటిస్తున్నట్టు తెలుపుతూ, ఆమె పాత్రకు సంబంధించిన ఒక వ్యాద్యవైన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ వీడియోలో జరీనా వహాబ్ పోషిస్తున్న 'జుబేదా' పాత్రలోని భావోద్వేగ కోణాన్ని ఆవిష్కరించారు. ఒకప్పుడు రైల్వే స్టేషన్‌లో ఆత్మహత్య చేసుకోవాలనుకున్న ఆమె, ఆకలికి తట్టుకోలేక భిక్షమెత్తుకున్న సందర్భాన్ని గుర్తుచేసుకునే సన్నివేశం కంటతడి పెట్టిస్తుంది. ఒక బిచ్చగత్తె జీవితంలోని కఠిన వాస్తవాలను, ఆత్మగౌరవాన్ని, మాతృత్వంలోని ఆర్తిని ఈ సీన్ కళ్లకు కట్టినట్టు చూపించింది. సినిమాలోని ప్రధాన ఎమోషన్‌ను ఈ గ్లింప్స్ ప్రతిబింబిస్తోంది. ఇదిలా ఉండగా, కొద్ది రోజుల క్రితం ఈ సినిమా నుంచి టబు పాత్రకు సంబంధించిన గ్లింప్స్‌ను కూడా మేకర్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఆమె గౌరీ హెగ్డే అనే పవర్‌ఫుల్ ఇన్‌కమ్ ట్యాక్స్ డిప్యూటీ కమిషనర్‌గా కనిపించనున్నారు. "మన స్టైల్‌లో ముందు షూట్ చేస్తాం, తర్వాత మాట్లాడతాం" అంటూ ఆమె చెప్పే డైలాగ్ పాత్ర తీవ్రతను తెలియజేసింది. ఒకవైపు అంత పవర్‌ఫుల్ ఆఫీసర్, మరోవైపు ఇంతటి దీనస్థితిలో ఉన్న తల్లి పాత్రల మధ్య కథ ఎలా సాగు తుందనే ఆ సక్తిని చిత్ర బృందం పెంచింది.

ఈ చి త్రంలో వి జయ్ సేతుపతి సరసన సంయుక్త హీరో ౦౨౨న్ గా నటిస్తుండగా, కన్నడ స్టార్ దునియా విజయ్, బ్రహ్మాజీ, వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలనం సృష్టించిన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. పూరీ కనెక్ట్స్ బ్యానర్‌పై పూరీ జగన్నాథ్, చార్మీ కౌర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, జేబీ మోషన్ పిక్చర్స్ సమర్పిస్తోంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# 'హాయ్' (జీ 5)

## మూవీ రివ్యూ



బుల్లి తెరపై నుంచి వెండితెర వరకూ ఎదిగిన నటులలో కెవిన్ రాజ్ ఒకరుగా కనిపిస్తాడు. కథానాయకుడిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న కెవిన్, నయనతారతో కలిసి నటించిన సినిమానే 'హాయ్'. విష్ణు దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఆగస్టు 28వ తేదీన విడుదలైంది. రాధిక . ప్రభు .. భాగ్యరాజ్ .. సుహాసిని కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, తమిళంతో పాటు తెలుగు .. కన్నడ .. మలయాళ భాషల్లో 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది. సుబ్రమణ్యం (కెవిన్) ఒక రకంగా కలవారి కుటుంబానికి చెందిన అబ్బాయే. ప్రమీల దంపతులు (రాధిక - భాగ్యరాజ్) సుబ్రమణ్యానికి పెళ్లి సంబంధాలు చూడటం మొదలుపెడతారు. అయితే ప్రేమించి పెళ్లి చేసుకోవాలనేది సుబ్రమణ్యానికి ఉన్న కోరిక. తాను ఇష్టపడిన అమ్మాయిలు తనని ఎంతమాత్రం పట్టించుకోకపోవడం అతనికి చాలా అసంతృప్తిని కలిగిస్తుంది. అందువలన తనకి తగిన అమ్మాయికి కోసం వెతుక్కుంటూ అతను హైదరాబాద్ కి చేరుకుంటాడు. అక్కడే ఒక సంస్థలో జాబ్ చేస్తూ ఉంటాడు. ఇక దేవసేన (నయనతార) తండ్రి చంద్రం (ప్రభు) ఒక తాగుబోతు. భార్య ఇల్లొదిలి వెళ్లిపోయిన దగ్గర నుంచి అతను తాగుడికి బానిస అవుతాడు. తన కోసం భార్య తప్పకుండా తిరిగొస్తుందనే ఆశతో ఎదురుచూస్తూ ఉంటాడు. తాగుడు కోసం అతను చేసిన అప్పు తీర్చమని దొరబాబు ఒత్తిడి చేస్తుంటాడు. లేదంటే దేవసేనను తనకిచ్చి పెళ్లి చేయమని పోరుతుంటాడు. ఈ నేపథ్యంలో దేవసేన పారిపోయి హైదరాబాద్ కి చేరుకుంటుంది. అక్కడే ఆమెకి 'సుబ్బు' తారసపడతాడు. ఇద్దరి మధ్య పరిచయం పెరుగుతుంది. దేవసేనతో సాన్నిహిత్యం పెరుగుతున్నా కొద్దీ సుబ్బుకి ఆమెపై ప్రేమ పెరిగిపోవడం మొదలవుతుంది. ఆమె పట్ల తనకి గల ప్రేమను బయటపెట్టే సమయం కోసం అతను ఎదురుచూస్తుంటాడు. అయితే సుబ్బు పట్ల దేవసేన స్నేహంగా మాత్రమే ఉంటుంది. జీవితంలో స్థిరపడటం కోసం 'లండన్' వెళ్లే ప్రయత్నాలలో ఉంటుంది. తన మనసులోని మాటను సుబ్బు చెప్పలేడు .. ఆమెను ఆపలేడు. అలాంటి పరిస్థితులలో అతను సతమతమైపోతుంటాడు. సుబ్బు - దేవసేన లేచిపోయారనీ, ఇద్దరూ కలిసి హైదరాబాద్ లో ఉంటున్నారనే విషయం ఇరు కుటుంబాలకు తెలుస్తుంది. దాంతో వాళ్లంతా ఒక్కసారిగా వచ్చేసి ఇద్దరినీ నిలదీస్తారు. ఆ కంగారులో సుబ్బు, తాను దేవసేనను ప్రేమిస్తున్నాననీ .. తన కారణంగా ఆమె నెల తప్పిందని చెబుతాడు. దాంతో చంద్రం చేసిన అప్పు తీర్చేసి, దేవసేనను తమ కోడలిగా చేసుకోవడానికి ప్రమీల దంపతులు అంగీకరిస్తారు. అప్పుడు దేవసేన ఏం చేస్తుంది? ఆమె తల్లి ఇల్లొదిలి ఎందుకు వెళ్లిపోతుంది? దేవసేన లండన్ వెళ్లిపోతుందా? సుబ్బుతో పెళ్లికి ఒప్పుకుంటుందా? అనేది మిగతా కథ. ప్రేమించి పెళ్లి చేసుకోవాలనే పట్టుదలతో పట్నానికి వచ్చిన హీరో. నచ్చని పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక పారిపోయి పట్నానికి చేరుకున్న హీరోయిన్ మధ్య పరిచయం జరుగుతుంది. అతని వైపు నుంచి ఆమె పట్ల ఉన్నది ప్రేమ. ఆమె వైపు నుంచి అతని పట్ల ఉన్నది స్నేహం. హీరో తన పేరెంట్స్ తో చెప్పిన ఒక అబద్ధం కారణంగా, అతని ఇంటికి ఆమె వెళ్లవలసి వస్తుంది. అతను చెప్పినట్టుగా నటించాల్సి వస్తుంది. ఫలితంగా చోటుచేసుకునే సన్నివేశాల చుట్టూ అల్లుకున్న కథ ఇది. హీరో .. హీరోయిన్ పారిపోయి చెరో దారిలో హైదరాబాద్ చేరుకోవడం .. అక్కడ ఇద్దరూ తారస పడటం .. వాళ్లిద్దరి మధ్య పరిచయం పెరగడం వంటి సన్నివేశాలతో ఫస్టాఫ్ చాలా సరదాగా .. సందడిగా సాగిపోతుంది. ఇక ఇరువురి కుటుంబాలకు ఈ విషయం తెలియడం, అబ్బాయితో పాటు ఆమెను కూడా తమ ఇంటికి తీసుకుని వెళ్లడం .. తాము చెప్పిన అబద్ధాన్ని నిజం చేయలేక హీరో - హీరోయిన్ నానా తిప్పలు పడటం వంటి మలుపులతో సెకండాఫ్ నడుస్తుంది. పెళ్లి విషయంలో తనకంటూ ఒక అభిప్రాయం ఉన్న హీరో పట్నానికి రావడం, ఇష్టం లేని పెళ్లి చేసుకోలేక అదే పట్నానికి హీరోయిన్ రావడం .. ఇద్దరి మధ్య పరిచయం చాలా సినిమాలలో ఆల్రెడీ చూసేసిన ఒక రొటీన్ ట్రాక్. హీరోయిన్ డబ్బు కోసం ఒక దగ్గర కేర్ టేకర్ గా చేరడం .. ఆ ఫ్యామిలీ ద్వారా లండన్ వెళ్లే ఆలోచన చేయడం .. తనకి ఆమె దూరమైపోతుందేమోనని హీరో మానసిక సంఘర్షణకి లోను కావడం కూడా మామూలే. ఇక ఈ కథలో కాస్త గందర గోళం ఏర్పడటానికి కారణం హీరో ఆడిన ఒక అబద్ధం. ఆ అబద్ధం హీరో చెప్పడం కూడా అంత అవసరమని ఆడియన్స్ కి అనిపించదు. ఈ అబద్ధమే దాదాపు అన్ని పాత్రలను అయోమయంలో పడేసి, అందుకు సంబంధించిన హడావిడితోనే ప్రీ క్లైమాక్స్ కి తీసుకుని వెళ్లి .. అక్కడి నుంచి క్లైమాక్స్ ను చూపిస్తుంది. క్లైమాక్స్ దగ్గరికి వచ్చేసరికి మళ్లీ రొటీన్ బాటనే పట్టడం కనిపిస్తుంది. చాలా కథలు నడిచిన ఫార్మాట్ లోనే ఈ కథ కూడా వెళుతుంది. అతకని అబద్ధం తప్ప ఎక్కడా కొత్తదనం కనిపించదు. కాకపోతే ట్రీట్మెంట్ కారణంగా, రాధిక .. భాగ్యరాజ్ .. ప్రభు .. సుహాసిని వంటి బలమైన తారాగణం కారణంగా బోర్ అనిపించదు. ప్రధానమైన పాత్రలను పోషించిన నటీనటులంతా సీనియర్స్ కావడం వలన, ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. రాజేశ్ శుక్లా ఫొటోగ్రఫీ .. జీన్ మార్టిన్ సంగీతం .. ఫిలోమిన్ రాజ్ ఎడిటింగ్ ఫరవాలేదు. ఒకరిని ఇష్టపడటం చాలా తేలిక. అయితే ఆ వ్యక్తి చేత తిరిగి ప్రేమించబడటం చాలా కష్టం. నిజమైన ప్రేమను పొందాలంటే నిరీక్షణ తప్పదు అనే ఒక సందేశం ఈ కథలో మనకి

Published and owned by p.v. vijayabhaskar published at Dr.No.50-49-42, T.P.T. Colony, Near Hindu Press, Seethammadhara-530013, Visakhapatnam, Editor : Mallavarapu Srinivas Rao, Cell No.9000393888, RNI. No. 2009/29089, Email.: http://www.askharaprabha.com/